J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 24 17.11.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## తెలంగాణలో ఎలక్షన్

# ఆంధ్రాలో టెన్షన్

***తెలంగాణ ఎన్నికలలో తిట్ల పర్వం, భౌతిక దాడులు - ప్రతి దాడులు, నాయకుల అలకలు, తనకి ఎదురే లేదనుకున్న కేసీఆర్‌పై నేతల తిరుగుబాటు, బిఆర్ఎస్ తడబాటు, మూడవ స్థానంలో ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు ప్రధాన పోటీ దారుగా తయారై ఎన్నికల వేళకి కొరకరాని కొయ్యగా తయారవడం... ఇలాంటి వన్నీ 2024లో జరగనున్న ఆంధ్రా ఎన్నికలకి సంకేతాలా..? అంటే, అవుననే అంటున్నారు విశ్లేషకులు. తెలంగాణ ఎన్నికల ఫలితాల కోసం అక్కడి నేతలకన్నా ఆంధ్ర నాయకులే ఎక్కువ ఆసక్తి కనపరుస్తున్నారని చెప్తున్నారు. ఎలక్షన్ తెలంగాణలో అయితే, టెన్షన్ ఆంధ్రాలో కనిపిస్తోందని అంటున్నారు.***

తెలంగాణ ప్రజలు తమ మనోగతాన్ని ఓటు రూపంలో బయటపెట్టడానికి మరో 13 రోజులే గడువుంది. ఆ తరువాత మూడురోజులకి పార్టీల జాతకాలు తేలిపోతాయి. నవంబర్ 30న పోలింగ్, డిసెంబర్ 3న కౌంటింగ్. నిజానికి ఆరు నెలల క్రితం వరకూ ఆ రాష్ట్రంలో కేసీఆర్ కారుకి ఎదురు లేదన్నట్లుగానే పరిస్థితులు ఉండేవి. బండి సంజయ్ బీజేపీ బాధ్యతలు చేపట్టినన్నినాళ్ళు భాజపాని గెలుపు బండి ఎక్కిస్తాడన్నంత స్థాయిలో పార్టీలో కదలిక తెచ్చారు. బీజేపీ అధిష్టానం ఆయనని మార్చి కాంగ్రెస్‌ని రెండవ స్థానంలో కూర్చోబెట్టింది. అది ఆ పార్టీ స్వయంకృతాపరాధం అనుకుందాం. అయితే, ఇప్పుడు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడి, పోలింగ్ రోజుల్లోకి వచ్చాక అక్కడ వాతావరణం పూర్తిగా మారిపోయిందంటున్నారు విశ్లేషకులు. కేసీఆర్ సైతం ఊహించనంత స్థాయిలో తెలంగాణలో కాంగ్రెస్ పుంజుకుంది. తెలంగాణ తెచ్చింది కేసీఆర్ అయితే, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అన్న నినాదాన్ని రేవంత్ గట్టిగానే ప్రజల్లోకి తీసుకెళ్లారు. కేసీఆర్ పార్టీ కుటుంబపాలన, అక్రమ సంపాదన, నియంతృత్వ పోకడ వంటి అంశాలను కూడా మాటల తూటాల రూపంలో రేవంత్‌రెడ్డి ప్రజల మనసుల్లోకి ఎక్కించారు. గెలుపు ఖాయంఅన్న ధీమాతో ఉన్న కేసీఆర్‌కి ఇప్పుడు చమటలు పడుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో 2004లో జరిగిన ఎన్నికలలో తొమ్మిదిన్నర సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుని ఓడించడమే ధ్యేయంగా ఆనాటి కాంగ్రెస్‌పార్టీ నాయకులంతా ఒక్కటయ్యారు. వారికి తోడుగా అప్పట్లో తెరాస, కామ్రేడ్లు కూడా జతకట్టి బాబుని మట్టి కరిపించారు.

ఇప్పుడు కేసీఆర్ పది సంవత్సరాలుగా, అంటే కొత్త రాష్ట్రం ఏర్పడ్డప్పటినుండి తెలంగాణలో చక్రం తిప్పుతున్నారు. తన ఉద్యమ ఫలితమే తెలంగాణ వచ్చిందన్న వాదాన్ని తెరపైకి తెచ్చి, రాష్ట్రాన్ని సొంతం చేసుకున్నట్లుగా ప్రవర్తిస్తున్నారు. గత పదేళ్ల కాలంలో ఎవరూ ఊహించనంత స్థాయిలో జరిగిన హైదరాబాదు నగర అభివృద్ధిని తన ఖాతాలో వేసుకుని ఇక తన చివరి శ్వాస వరకూ తానూ, ఆ తరువాత తన కొడుకు కేటీఆర్ శాశ్వతంగా తెలంగాణ నవాబులుగా చలామణి అవుతామన్న ధీమాతో ఉన్నారు.

అలాంటి కేసీఆర్‌ని, ఆయన పార్టీని ఇంటికి పంపాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ వాదులంతా తమ విభేదాలని, అభిప్రాయ భేదాలని పక్కనపెట్టి ఒక్కటయ్యారు.

10 లో

## నెల్లూరు లోక్‌సభ బరిలో...

# వీపీఆర్ Vs నారాయణ?

## నగరానికి రామనారాయణరెడ్డి లేదా మనుక్రాంత్‌రెడ్డి..??



***సరిగ్గా మరో నాలుగునెలలు, 16 వారాలు, 120 రోజలలో అంటే మార్చి 2024 మూడవ వారానికల్లా వేసవి కంటే ముందుగానే దేశంలో సార్వత్రిక ఎన్నికల వేడి మొదలైపోతుంది. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి కాబట్టి వ్యూహాలు, ప్రతివ్యూహాలు జోరుగానే ఉంటాయి. వాటికంటే ముందుగా ఊహాగానాలు, విశ్లేషకుల అంచనాలు, రాజకీయవర్గాల జోశ్యాలు కూడా జోరుగానే పుకార్ల రూపంలో షికారు చేస్తాయి.***



అలాంటి ఒక పుకారే ఇప్పుడు నెల్లూరుజిల్లా రాజకీయాలలో షికారు చేస్తోంది. ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైసీపీ లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేయబోయేది తానేనని స్వీయ ప్రకటన చేసుకుని రాజ్యసభ సభ్యులు, జిల్లా వైసీపీ అధ్యక్షులు, సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ప్రజాక్షేత్రంలో తిరగడం కూడా మొదలుపెట్టారు. 'మా నమ్మకం నువ్వే జగన్', 'ఫ్యాను గుర్తుకే మన ఓటు', 'ఆదరించండి ఆశీర్వదించండి' వంటి నినాదాలతో సామాజిక మాధ్యమాలద్వారా ప్రచారం కూడా ప్రారంభించేశారు.

ఈ తరుణంలో వేమిరెడ్డిపై తెలుగుదేశం నుండి పోటీ చేయబోయేదెవరు? అన్ని విధాలా ఆయనతో సమానంగా ఢీ కొట్టి మోటుకోగలిగిన నేత ఎవరు?? అన్న అనుమానం, ఆసక్తి అన్ని రాజకీయపార్టీల శ్రేణులలో కనిపిస్తోంది. అయితే, ఆయనపై మాజీ మంత్రి, నారాయణ విద్యాసంస్థల వ్యవస్థాపకులు పొంగూరు నారాయణ టీడీపీ లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నారన్న వార్త తాజాగా జిల్లా రాజకీయవర్గాలలో చక్కర్లు కొడుతోంది.

## వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అనే పేరు కన్నా... వీపీఆర్ అన్న పేరు చెప్తే ఆయనని తెలియని వారు, గుర్తుపట్టని వారు ఉండరు. జిల్లాలో దాన ధౌరేయులుగా ప్రసిద్ధి చెందిన రేబాల, దొడ్ల, తిక్కవరపు, బెజవాడ, మాగుంట కుటుంబాల తరహాలో అపర దానకర్ణుడిగా అపార కీర్తిప్రతిష్టలు సంపాదించారు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి. జిల్లాలో ఆయన సహాయం పొందని అనాథ ఆశ్రమమే ఉండదు. వీపీఆర్ విద్య, వైద్యం పేరుతో కార్పొరేట్ విద్య, వైద్యం ఉచితంగా అందిస్తున్నారు. వీపీఆర్ వికాస్ పేరుతో గ్రామీణ వికాసానికి దోహద పడుతూ, వీపీఆర్ అమృతధార కార్యక్రమాన్ని ప్రారంభించి వాటర్‌ప్లాంట్ల ద్వారా పల్లెవాసుల దాహాన్ని తీరుస్తున్నారు. ఎక్కడ అవసరముంటే అక్కడ తానున్నానంటూ స్పందిస్తూ ఆపన్నుల మనసుల్లో దైవంగా నిలిచారాయన. సేవాగుణంలో తనకుతానే సాటి అని ఓ వైపు నిరూపించుకుంటూనే, మరోవైపు ఆధ్యాత్మికతత్పరతలో కూడా తానే మొదటి వరుసలో నిలిచారు.

అనేక ఆలయాలలో

3 లో



# జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలి

○ రైతు నాయకుల విజ్ఞప్తి



జిల్లాలో రైతులు కష్టాల్లో ఉన్నారని, ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు పంటలు వేసుకునేందుకు రైతులకు సహకరించి, ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు దర్గాబాబు, కాంగ్రెస్ నాయకులు వేలమూరి శివశేఖర్‌రెడ్డి కోరారు. ఈనెల 13న జలదంకిలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లా డుతూ, జిల్లాలో ఈసారి సరిగ్గా వర్షాలు కురవక రైతులు పంటలు సాగుచేసుకోలేక పోతున్నారని, ఇప్పటికే అదును దాటుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కరువుబారిన పడకుండా అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# నేత్రపర్వం.. పెంచలస్వామి రథోత్సవం



దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలంలోని పెంచలకోనలో వెలసివున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఈనెల 12న విశేష పూజలు చేశారు. అనంతరం నరకాసుర వధ అలంకారం, దీపావళి ఆస్థాన రథోత్సవం నేత్రపర్వంగా జరిగాయి. ఆలయ సహాయ కమిషనర్ కె.జనార్దన్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# టీచర్ల సమస్యలు పరిష్కరించండి



ఉపాధ్యాయుల సమస్యలు తీర్చాలంటూ ఏపీ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఈనెల 13న నెల్లూరులోని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని కలసి విన్నవించారు. ముఖ్యంగా పీఆర్‌సీ బకాయిలు, ఏపీజీఎల్ఐ లోన్లు, పీఎఫ్ లోన్‌లు సకాలంలో విడుదలయ్యేలా చూడాలని, ఓపీఎస్‌ను పునరుద్ధరించేందుకు ప్రభుత్వంతో సంప్రదించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషిచేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వారికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీని కలసిన వారిలో ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు చక్రపాణి, జిల్లా అధ్యక్షుడు రాజగోపాలాచారి తదితరులున్నారు.

# జవహర్ భారతిలో అలరించిన చిన్నారుల నృత్యాలు



కావలి జవహర్‌భారతి కళాశాలలో ఈనెల 13న డాక్టర్ డిఆర్ విశ్వోదయ బాలల దినోత్సవ సాంస్కృతిక పోటీల సందర్భంగా చిన్నారుల నాట్యాలు అందరినీ అలరించాయి. డాక్టర్ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనేక పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని జానపద, శాస్త్రీయ నృత్యాలను అద్భుతంగా ప్రదర్శించి అందరి అభినందనలు అందుకున్నారు. విశ్వోదయ విద్యాసంస్థల రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, రామ్‌సెంటర్ ఛైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, ఆర్గనైజర్ జ్యోతిశ్రీల పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి.

# బీసీ హాస్టల్ పిల్లలకు టపాసుల వితరణ



దీపావళి పండుగ సందర్భంగా కోవూరు పంచాయతీవార్డు సభ్యురాలు అత్తిపల్లి అనూప్‌రెడ్డి రూ.15 వేల విలువచేసే టపాసులను కోవూరులోని బీసీ హాస్టల్లో చదువుకుంటున్న పిల్లలకు అందజేశారు. పండుగకు ఇళ్లకు వెళ్లకుండా హాస్టల్లోనే ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు వాటిని పంచిపెట్టడం తనకెంతో సంతోషంగా ఉందని, వాటిని పిల్లలకు అందజేయాలని ఎంపీడీఓ శ్రీహరిని కోరారు. ఈ కార్యక్రమంలో సంక్షేమశాఖ అధికారులు వెంకట్రావు, పద్మ, సుప్రజ, నాగభూషణమ్మ, జ్యోతిరాణి, సంపత్ తదితరులు పాల్గొని ఆమె వితరణకు ధన్యవాదాలు తెలిపారు.

## బుచ్చి సీఐ రామారావు..

# గుండెపోటుతో కన్నుమూత



బుచ్చిరెడ్డి పాళెం సర్కిల్ ఇన్స్‌పెక్టర్, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే పోలీసు అధికారిగా మంచిపేరున్న జి.రామారావు(55) గుండెపోటుతో హఠాన్మరణం పాలయ్యారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఈనెల 12న ఆయన విధులకు హాజరయ్యారు. ఉన్నట్లుండి గుండెనొప్పి రావడంతో వెంటనే నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కానీ, అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఆయన మృతితో వారి కుటుంబం శోకసాగరంలో మునిగిపోయింది. ఆ సమాచారం విన్న వెంటనే జిల్లా ఎస్పీ డా. తిరుమలేశ్వరరెడ్డి హుటాహుటిన వెళ్ళి రామారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అదేవిధంగా, కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆసుపత్రి వద్దకు వెళ్ళి రామారావు కుటుంబసభ్యులను పరామర్శించి వారికి తామంతా అండగా ఉంటామంటూ ధైర్యం చెప్పారు. డీసీఎమ్మెస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు తదితరులు ఆయన కుటుంబానికి తమ సంతాపం తెలిపారు.

రామారావు స్వస్థలం గుంటూరుజిల్లా పొన్నూరు మండలంలోని మన్నవ గ్రామం. 1996లో ఆర్ఎస్ఐగా పోలీసు శాఖలో చేరారు. ఆ తర్వాత డైరెక్ట్ ఎస్ఐగా 2002లో ఉదయగిరి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించి, 2010లో సీఐగా ఉద్యోగోన్నతి పొందారు. ఆయన భౌతికకాయాన్ని ఇక్కడ నుంచి స్వస్థలం మన్నవ గ్రామానికి పంపగా, ఈనెల 13న అక్కడ అంత్యక్రియలు జరిగాయి. డిఎస్పీ వీరాంజనేయరెడ్డి, ఎస్‌బీ సీఐ కె.రామకృష్ణారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మామిడిపూడి రోడ్డు

# బాగుచేయండి



ముత్తుకూరు నుంచి మామిడిపూడి మీదుగా ఏపీ జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రం వరకు ఉన్న రోడ్డు ఎంతోకాలంగా మరమ్మతులకు నోచుకోక పరమ అధ్వాన్నంగా ఉందని, ఆ రోడ్డును వెంటనే బాగుచేయాలని కోరుతూ సర్వేపల్లి నియోజకవర్గం జనసేన నాయకుడు బొబ్బేపల్లి సురేష్‌బాబు మోకాళ్ళపై కూర్చొని నిరసన తెలిపారు. ఈనెల 13న జనసేన నాయకులతో కలసి ఆ రోడ్డు బాగు కోసం ఆయన ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అశోక్, సుమన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కరువును చూడరు.. రైతులను పట్టించుకోరు

## - వైకాపా నేతలపై మాజీమంత్రి సోమిరెడ్డి ధ్వజం



అరాచకాలు, దౌర్జన్యాలు చేయడం, అందినకాడకి దోచుకోవడం తప్ప వైకాపా నాయకులు అటు కరువు పరిస్థితులను కానీ, ఇటు రైతుల అవస్థలను కానీ పట్టించుకోవడం లేదని మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈనెల 13న నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో పాటు, మంత్రివర్గసభ్యులు కూడా రైతులను గాలికొదిలేశారని, రాష్ట్రంలోని సంపదను అడ్డగోలుగా దోచుకోవడం తప్ప, వారికి వేరే ఆలోచన ఉండడంలేదని విమర్శించారు. చివరికి సొంతజిల్లా అయిన కడపలో ఒక్క కరువు మండలాన్ని కూడా సీఎం జగన్ ప్రకటించలేదని, రాయలసీమను నట్టేట ముంచారని దుయ్యబట్టారు. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ వర్షాలు లేక రైతులు పంటలు వేయలేక తీవ్రంగా నష్టపోయారన్నారు. రాష్ట్రంలోని 474 మండలాల్లో కరువు పరిస్థితులుంటే కేవలం 103 మండలాల్లో మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. వర్షాభావంతో రైతులు పడే బాధలు వర్ణనాతీతమని, దాదాపు గత యాభైఏళ్ల కాలంలో ఇంతటి దుర్గతిని చూడలేదని అన్నారు. పరిస్థితులింత దయనీయంగా ఉన్నా మంత్రులు కానీ, ముఖ్యమంత్రి కానీ కరువు ప్రాంతాల్లో పర్యటించకపోవడం దారుణమన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, ఈ అరాచక పాలనకు ప్రజలే గుణపాఠం చెప్తారని అన్నారు.

# ఉత్సాహంగా దీపావళి





ఈనెల 12న దీపావళి పర్వదినాన్ని జిల్లా ప్రజలు ఆనందసందోహాల మధ్య వేడుకగా జరుపుకున్నారు. ఆలయాలకు వెళ్ళడం, సంప్రదాయబద్ధంగా ఇంటింటా దీపాలు వెలిగించడం, దీపదానాలు, మహాలక్ష్మీదేవికి ప్రత్యేకపూజలు చేయడం వంటి కార్యక్రమాలన్నీ ఎంతో ఉత్సాహంగా చేసుకున్నారు. దీపావళి సందర్భంగా నగరంలోని బాణసంచా దుకాణాలు క్రిక్కిరిసిపోయాయి. చిన్నారులు, పెద్దలు, కుటుంబసభ్యులంతా కలసి కోలాహలంగా వీధివీధినా టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. నగరంలోని రంగనాయకులపేటలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయంలో స్వామివారికి తిరుమంజనసేవ, అనంతరం గోపురోత్సవం వేడుకగా జరిగాయి. మూలాపేటలో ఉన్న భువనేశ్వరీదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో దీపావళి పల్లకి ఉత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. మూలాపేటలోని రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో దీపావళి వేడుకలు, స్వామివార్లకు తిరుమంజన సేవ, రాత్రి పేట ఉత్సవం నయనానందకరంగా సాగాయి. అదేవిధంగా, దర్గామిట్టలో ఉన్న అష్టలక్ష్మి ఆలయంలో ధనలక్ష్మీ కుబేరపూజ వైభవంగా జరిగింది.

# కాటంరెడ్డి ఆదిరెడ్డి సేవలు చిరస్మరణీయం



దివంగత నేత, పేదలకు ఆత్మబంధువు కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి సేవలు చిరస్మరణీయమని విడవలూరు మండలం పొన్నపూడి వెంకటనారాయణపురం గ్రామస్తులు పేర్కొన్నారు. ఈనెల 13న మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తండ్రి స్వర్గీయ కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి జయంతిని పురస్కరించుకుని గ్రామంలో వారు నెలకొల్పుకున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆదిరెడ్డి చేపట్టిన కార్యక్రమాలు, ఆయన దాతృత్వం అపురూపమని అన్నారు. ముఖ్యంగా మత్స్యకారుల అభ్యున్నతి కోసం సొంత భూమిని సైతం ఇచ్చిన మహనీయుడు ఆదిరెడ్డి అని, మత్స్యకారులకు ఆయన చేసిన సేవలు ఏనాటికీ మరచిపోలేనివని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన పలువురు మత్స్యకార ప్రముఖులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. అదేవిధంగా, ఆదిరెడ్డి స్వస్థలమైన అల్లూరులోనూ పెద్దసంఖ్యలో అభిమానులు, పలువురు ప్రముఖులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.

# వీపీఆర్ Vs నారాయణ?

(మొదటి పేజీ తరువాయి)




## నగర నియోజకవర్గంలో ఎవరు?

ఒకవేళ నారాయణ లోక్‌సభకి పోటీచేస్తే, టీడీపీ నగర నియోజకవర్గ అభ్యర్థి ఎవరన్న చర్చ కూడా వినిపిస్తోంది. ఆనం రామనారాయణరెడ్డి మొగ్గుచూపిస్తే ఆయనని ముగ్గులో దించాలని పార్టీ అధిష్టానం ఆలోచిస్తున్నట్లు వార్త. అలా కాని పక్షంలో టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థిగా జనసేన జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డిని బరిలో దింపే ఆలోచనలో కూడా టీడీపీ అధిష్టానం ఉన్నట్లు ఆ పార్టీ శ్రేణులు చెప్తున్నాయి. కర్ణుడి చావుకి కారణాలు అనేకం అన్నట్లుగా, 2009లో కాంగ్రెస్‌పార్టీలో ఉన్న అంతర్గత ముఠా పోరాటాల కారణంగా ప్రజారాజ్యం పార్టీకి కలిసొచ్చి దివంగత శ్రీధర్‌కృష్ణారెడ్డి శాసనసభ్యుడైనట్లుగా, ఇప్పటికే వైసీపీలో పతాక స్థాయిలో ఉన్న అలాంటి ఇంటిపోరే తమకి కలిసొస్తుందని జనసేన వర్గాలు సంబరపడిపోతున్నాయి.

ఈరోజుకి వీపీఆర్ వైసీపీ అభ్యర్థిగా లోక్‌సభకి పోటీ చేయబోతున్నారన్నది మాత్రమే నిజం. మిగిలినవన్నీ ఊహాగానాలే. వాటిల్లో కొన్ని నిజం కావచ్చు, కాకపోవచ్చు. అయితే, వీపీఆర్‌కి సరైన పోటీ ఇవ్వగలిగింది ఒక్క నారాయణే అని మాత్రం టీడీపీ వర్గాలు బల్లగుద్ది మరీ చెప్తున్నాయి. చూద్దాం ఏం జరుగుతుందో!

కుంభాభిషేకాలు జరిపించారు. రెండు సార్లు శ్రీవారి వైభవోత్సవాలు చూసే భాగ్యాన్ని జిల్లా వాసులకి కల్పించారు. ప్రతి కార్తీక మాసంలో లక్షదీపోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. స్వతహాగా ఆయన రాజకీయ నాయకుడు కాదు. ప్రతిభావంతమైన వ్యాపారవేత్త. దయార్ద్ర హృదయమున్న సేవాతత్పరుడు. అపార దైవభక్తి కలిగిన ఆధ్యాత్మిక చింతనాతత్పరుడు. అన్ని రాజకీయ పార్టీల నాయకులతో స్నేహ భావంతో మెలిగేవారు. తనకి అందరూ కావాలన్న తత్వంతో ఉండేవారు. అయితే, అనూహ్యంగా 2018లో రాజ్యసభ సభ్యత్వ పదవి ఆయనని వరించింది. అతి క్లిష్టమైన తరుణంలో వైసీపీకి తోడుగా నేనున్నా అన్నట్లుగా ధైర్యం చేసి రాజ్యసభకి పోటీచేసి రాజ్యసభ సభ్యత్వాన్ని దక్కించుకున్న ఘనత తన సొంతం చేసుకున్నారు ప్రభాకరరెడ్డి. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో పార్టీ సమన్వయకర్తగా ఇతర జిల్లాలలో వైసీపీ విజయానికి కృషి చేశారు. ఆ తరువాత జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా నియమింపబడి, ఇప్పుడు రానున్న ఎన్నికలలో లోక్‌సభ అభ్యర్థిగా నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం నుండి వైసీపీ తరఫున పోటీ చేయబోతున్నారు. 'మళ్ళీ జగనే ఎందుకు రావాలి' అని వివరిస్తూ ప్రజాక్షేత్రంలో తిరుగుతున్నారు.

### పొంగూరు నారాయణ

నారాయణ కూడా తొలి నుండీ రాజకీయ నాయకుడు కాదు. 2014లో తెలుగుదేశం అధికారంలోకి రావడానికి నారాయణ వ్యూహకర్తగా మాత్రమే వ్యవహరించారన్న విషయం బహిరంగ రహస్యం. అయితే, నారాయణ చిత్తశుద్ధిని, క్రమశిక్షణని చూసి మెచ్చుకున్న పార్టీ అధినేత చంద్రబాబు... ఆయనకి మంత్రి పదవి కట్టబెట్టి రాజకీయ దండ తగిలించారు. మునిసిపల్ శాఖామాత్యులుగా పదవి ఇచ్చి, కొత్తగా అభివృద్ధి కానున్న రాజధానిని నారాయణ చేతికి అప్పజెప్పారు. రాజధానిలో శాశ్వత నిర్మాణాల విషయంలో జరిగిన జాప్యం, అంతర్గతంగా కుదిరిన ఒప్పందాలు, ఆర్థిక లావాదేవీలు తదితర ఆరోపణల అంశాన్ని పక్కనపెడదాం. మునిసిపల్ మంత్రిగా నెల్లూరుని మాత్రం అభివృద్ధిపథంలో నడిపించారన్నది ఎవరూ కాదనలేని వాస్తవం. గత 30 సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని అనేక పార్కులు పచ్చదనంతో కళకళలాడడంతోపాటు నగర, రూరల్ పరిధిలో ఎక్కువ స్థాయిలో సిమెంటు రోడ్ల నిర్మాణాలు జరిగాయి. 'వాల్ టు వాల్' అన్న నినాదంతో వెడల్పాటి రోడ్లను నిర్మించడంలో నారాయణ కృషి శ్లాఘనీయం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు కూడా ఆ సమయంలోనే వేగంగా జరిగాయి. 2019లో నారాయణ తొలిసారిగా ప్రత్యక్ష రాజకీయాలలో పాల్గొని పోటీ చేశారు. 2019 ఎన్నికలలో జగన్ సృష్టించిన సునామితో 175 సీట్లకు గాను 151 స్థానాలను వైసీపీ సాధిస్తే... వాటిలో నెల్లూరు నగరం అతి కష్టం మీద గట్టెక్కింది. నారాయణ నగరంలో ఏ స్థాయిలో అభివృద్ధి పనులు చేశారో చెప్పడానికి ఆ ఎన్నికే ఉదాహరణ.

స్వతహాగా నారాయణ విద్యావేత్త. దేశ వ్యాప్తంగా కొన్ని లక్షల మంది భావిభారత పౌరులను తీర్చిదిదుతున్న విద్యాసంస్థలకి ఆయన వ్యవస్థాపకులు. కేజీ నుండి పీజీ వరకూ విద్యనందిస్తున్న ఆయన సంస్థలలో కొన్ని వేలమంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. తమ విద్యాసంస్థల ద్వారా తనకున్న నెట్‌వర్కే 2014 ఎన్నికలలో బాబుకి బాగా పనికొచ్చిందన్నది ఆ పార్టీవర్గాల అభిప్రాయం. 2024లో రానున్న ఎన్నికలలో తాను నగర నియోజకవర్గం నుండి పోటీ చేయబోతున్నట్లు ఆయన కూడా స్వీయ ప్రకటన చేసుకుని జనంలో తిరుగుతున్నారు. అయితే, తాజాగా ఆయన పార్లమెంటుకి పోటీ చేయబోతున్నట్లుగా ఆ పార్టీ వర్గాలే ప్రచారం ప్రారంభించాయి. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిపై పోటీ చేయగలిగిన లక్షణాలతో పాటు వనరులు, వసతులు కూడా ఒక్క నారాయణకే ఉన్నాయన్నది తెలుగు తమ్ముళ్ల అభిప్రాయం.

### ఇద్దరి మధ్య గల కొన్ని సారూప్యతలు..!

వీపీఆర్ మితభాషి, చేతల మనిషే కానీ మాటల మాంత్రికుడు కాదు. ఎవరినీ అస్సలు విమర్శించరు. నారాయణ కూడా అంతే... పెద్దగా మాట్లాడరు. పేరుకి లెక్చరరే కానీ నాలుగు గోడల మధ్య తప్ప ప్రజాక్షేత్రంలో పెద్దగా క్లాసులు పీకరు. ఆయన కూడా ఎవరినీ పెద్దగా విమర్శించరు. వీపీఆర్ అన్ని పార్టీల వారితో స్నేహభావంతో ఉంటారు. ఎవరితోనూ శత్రుత్వం పెట్టుకోరు. నారాయణ కూడా అంతే. వివాదాలకు, రాజకీయ విమర్శలకి దూరంగా ఉంటారు. అజాతశత్రువు అనిపించుకోవాలనే ప్రయత్నిస్తారు. వ్యాపారవేత్తగా ఆర్థికంగా వీపీఆర్ బలవంతుడైతే, వేలకోట్ల విలువచేసే విద్యా సామ్రాజ్యాన్ని విస్తరింపచేసిన 'నారాయణ సంస్థల వ్యవస్థాపకుడిగా' ఆయనతో సమంగా సరితూగగల స్తోమత నారాయణకి ఉంది.

అయితే, ప్రభాకరరెడ్డికి సేవాపరాయణుడిగా, ఆధ్యాత్మికవేత్తగా, విద్యాదాతగా, పేదలకి ఉచిత వైద్యం అందిస్తున్న అభినవ ధన్వంతరిగా, దప్పికతో ఉన్నవారి దాహం తీరుస్తున్న అపర భగీరథుడిగా ప్రజలలో ఆదరణ ఉంది. కొన్ని గుణాలలో తప్ప వ్యక్తిత్వంలో, వృత్తిత్వంలో ఇద్దరూ సమానమే అన్నది టీడీపీ శ్రేణుల అభిప్రాయం. ప్రభాకరరెడ్డిపై పోటీచేయడానికి వీపీఆర్ సామాజిక వర్గం నుండి ఎవ్వరూ సాహసం చేయబోరన్న సమాచారంతోనే పార్టీ అధిష్టానం నారాయణని బరిలో దింపాలని చూస్తున్నట్లు సమాచారం.

# ఏఎంసీ చైర్మెన్‌గా పేర్నాటి కోటేశ్వరరెడ్డి



నెల్లూరు మార్కెటింగ్ కమిటీ (ఏఎంసీ) చైర్మెన్‌గా పేర్నాటి కోటేశ్వరరెడ్డిని నియమిస్తూ ఈనెల 15న ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. వైస్ చైర్మెన్‌గా ఒట్టూరు సుధాకర్‌ను, సభ్యులుగా తగరం మాధవి, రామలింగారెడ్డి, జి.శిరీష, కొంగర శీనయ్య, బండి చెంచయ్య, తాండ్ర సుజాత , ఈగా విజయమ్మ, తాటిపర్తి వెంకటేశ్వర్లు, బి.అనిత, స్వర్ణా జీవన్‌ప్రసాద్, మంచికంటి శ్రీనివాసులు, ఉప్పు సవిత, ప్రసన్న నియమితులయ్యారు. వైకాపాను నమ్ముకుని ఉన్న పలువురు పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఈ పదవులు రావడం సంతోషంగా ఉందని వైకాపా వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.



ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని గురువారం ఉదయం నెల్లూరులోని ఆయన నివాసంలో గౌరవపూర్వకంగా కలిసి 'విజయపథంలో నెల్లూరీయులు' కాఫీ టేబుల్ పుస్తకాన్ని అందజేస్తున్న లాయర్ పత్రిక సంపాదకులు శివప్రభాత్‌రెడ్డి (ప్రభు)

# ఆకట్టుకున్న 'జన జాతీయ గౌరవ్ దివస్' ర్యాలీ




నెల్లూరులోని ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈనెల 15న జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నగరంలోని గిరిజన సంక్షేమ బాల బాలికల కళాశాల వసతి గృహ విద్యార్థులతో ఐటిడిఏ కార్యాలయం నుంచి కొండాయ పాలెం గేట్ వరకు నిర్వహించిన ర్యాలీ అందరినీ ఆకట్టుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా ఈనెల15 నుండి 26వ తేదీ వరకు 11రోజులపాటు 'జాతీయ గౌరవ దివస్' కార్యక్రమాన్ని ఐటీడీఏ విద్యాసంస్థల పరిధిలో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, గిరిజనులకు అండగా నిలిచిన గిరిజన యోధుడు, జార్ఖండ్‌కు చెందిన బిర్సా ముండా జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం జరుగుతోందని ఐటీడీఏ పీఓ మందా రాణి తెలిపారు. ఈనెల 26వ తేదీవరకు ఐటీడీఏ ఆధ్వర్యంలో సాంస్కృతిక, క్రీడా పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులతో చంద్రశేఖరపురం ఏకలవ్య పాఠశాలలో మూడు రోజులపాటు జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అవుతారన్నారు. ఈ ర్యాలీలో ఐటిడిఏ అధికారులు జ్యోత్స్న, శ్రీనివాసులు, పరిమళ, శాంతకుమారి పాల్గొన్నారు.

# ధన్వంతరి జయంతి వేడుకలు




ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతిని నెల్లూరు ఎన్‌సిసి కాలనీలో ఉన్న ఓవెల్ విన్‌లైట్ స్కూల్‌లో ఇటీవల ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జగన్నాథలక్ష్మి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యంపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. అనేక జబ్బులకు, ఆరోగ్యసమస్యలకు ఆయుర్వేదం బాగా పనికివస్తుందని తెలిపారు. ఔషధ గుణాలు కలిగిన ఎన్నో రకాల ఆకులు, మూలికలతో కూడిన ఆయుర్వేద వైద్యం ఆరోగ్యానికి ఎంతో మంచిదని చెప్పారు. ఇంటర్నేషనల్ నాచురోపతి ఆర్గనైజేషన్ (ఐఎన్‌ఓ) జిల్లాశాఖ ప్రతినిధి, యోగా మాస్టర్ ఎంవి ప్రసన్నకుమార్, స్కూల్ సిఎండి ఆర్ వేణు, సిఇఓ ప్రమీల, జిఎం మహదేవన్, ఈడీ బాలు, డీజీఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# అపార్ట్‌మెంట్‌లలో భద్రత ఎంతో అవసరం

ఆకాశాన్నంటే భవనాల్లో నివసించడం ఎంత బాగుంటుందో!.. నిజానికి అవి అంత అందంగానూ, ఎన్నో అధునాతన వసతులతోనూ అద్భుతంగా ఉంటాయి. ఆకాశహర్మ్యాలంటే అవే. బహుళ అంతస్తులు మనదేశంలోనే కాదు, మొత్తం ప్రపంచమంతా భారీగా విస్తరిస్తూనే ఉన్నాయి. కోటానుకోట్ల వ్యయంతో వాటిని జనావళికి ఎంతో ఉపయోగకరంగా నిర్మిస్తున్నారు కూడా. రానురాను జనాభా పెరిగిపోతుండడం, పట్టణాల్లోను, నగరాల్లోనూ ఉండడానికి సరైన వసతులు లేక, అద్దె ఇళ్లు కూడా దొరక్క, సతమతమవుతున్న పరిస్థితి వచ్చేసింది. ఈ నేపథ్యంలో అపార్ట్‌మెంట్‌ల అవసరం వచ్చింది. ఇప్పుడు గ్రామ ప్రాంతాల్లో కూడా పెద్దపెద్ద భవనాలు, బహుళ అంతస్తుల మేడలు ఉంటున్నాయి. అన్ని ఫ్లోర్‌లలో ఉండేవారంతా సాధారణంగా కలిసి మెలిసి ఉంటారు. పండుగలు పబ్బాలు, పుట్టినరోజులు వంటివి భలేగా జరుగుతుంటాయి. మనకెవరూ లేకున్నా అపార్ట్‌మెంట్‌లలో ఉండేవారంతా మన ఆత్మీయులే అన్న అభిమానం అందరిలోనూ ఏర్పడుతోంది. అందుకే, అపార్ట్‌మెంట్ కల్చర్ అనేది ప్రజలకు బాగా అలవాటైపోయింది. కరెంటు, నీళ్ళు, ఇతరత్రా అన్ని సదుపాయాలు పుష్కలంగా ఉండే అపార్ట్‌మెంట్లల్లో ఉండడం ఎవరికైనా ఇష్టంగానే ఉంటుంది మరి!.. అయితే, వాటి ధర కూడా ఆకాశంలోనే ఉంటుంది. ఇంత వరకు బాగానే ఉంది కానీ, అత్యధికశాతం అపార్ట్‌మెంట్‌లలో భద్రతలు సరిగా లేకపోవడం ఒక పెద్ద లోపం. వాస్తవానికి భవనాల నిర్మాణాల విషయంలో ఎన్నో నియమ నిబంధనలున్నాయి. అయినా, వాటిని కొంతమంది పెద్దగా పట్టించుకోకపోవడం, నిర్లక్ష్యంగా ఉండడం వల్ల లేనిపోని ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇతర దేశాల్లో వీటి నిర్మాణాలు, నిర్వహణ, భద్రతల పట్ల ఎంతో జాగ్రత్తగా ఉంటారు. అత్యద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానంతో వందల అంతస్తులున్న భవనాల్లోనూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా హాయిగా ఉంటారు. అలాంటి సాంకేతికత మనదేశంలో ఏమేరకు ఉందో అందరికీ తెలిసిందే. అపార్ట్‌మెంట్‌లలో తరచూ జరిగే అగ్నిప్రమాదాలు ఎక్కువగా షార్ట్‌సర్క్యూట్ వల్లనే జరుగుతుంటాయి. మొన్నటికి మొన్న, దీపావళి

లాయర్
నవంబర్ 17, 2023

పక్కరోజునే హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఓ అపార్ట్‌మెంట్ అగ్నిప్రమాదానికి గురై 9మంది దుర్మరణం పాలుకావడం ఎంతో బాధాకరం. మృతుల్లో ఒకేకుటుంబానికి చెందిన ఏడుగురు ఉండడం, వారిలో ఆరేళ్ళ బాలిక, అయిదుగురు మహిళలు కావడం ఇంకా విషాదం. నాలుగంతస్తులున్న ఆ భవనంలో ఉన్నట్లుండి ఒక్కసారిగా పేలుడు జరిగి మంటలు చెలరేగడం, మొదటగా ప్రమాదానికి గురైన గ్రౌండ్‌ఫ్లోర్‌లో రసాయనాలతో కూడిన డ్రమ్ములు ఉండడం వల్ల మంటలు ఆ చుట్టుపక్కలంతా వ్యాపించి పెను ప్రమాదానికి దారితీయడం జరిగి ఉండవచ్చని అంటున్నారు. అలాంటి దుర్ఘటనలు చూసైనా సరే, అపార్ట్‌మెంట్‌లలో జాగ్రత్తలు ఎంత తప్పనిసరో గ్రహించాలి. ప్రమాదాలకు కారణమయ్యే రసాయన పదార్ధాలు కానీ, ఇతరత్రా పేలుడు వస్తువులు కానీ ఇళ్లమధ్యలో లేకుండా చూసుకోవాలి. చేతుల కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉండడం ఏనాటికీ మంచిది కాదు. ఇప్పటికైనా అగ్నిప్రమాదాలే కాదు, ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా అపార్ట్‌మెంట్‌లలో అన్ని రకాలుగా కట్టుదిట్టమైన భద్రతలు ఉండేలా చూసుకోవడం అవసరం. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, భద్రత విషయంలో ముందస్తు జాగ్రత్తలన్నీ తీసుకోవాలి. అపార్ట్‌మెంట్‌లకు ప్రాణప్రదమైన లిఫ్ట్‌ల వ్యవస్థను ఎప్పటికప్పుడు పరిశీలించుకుంటూ ఉండాలి. విద్యుత్ సమస్యలేమైనా ఉంటే అశ్రద్ధ చేయకుండా అప్పటికప్పుడు బాగుచేసుకోవాలి. అపార్ట్‌మెంట్ల నిర్వాహకులతో పాటు, వాటిల్లో నివాసం ఉండేవారంతా ఎవరికి వారు జాగ్రత్తలు తీసుకోవడమే కాక, అందరూ కలసి ఐక్యంగా తమ నివాసాల భద్రతకు ఏంచేయాలో వారానికోసారైనా సమీక్షించుకుంటుండాలి. మనం భద్రంగా ఉన్నామా లేదా అనేది పరిశీలించుకుంటూ ఉండాలి. ఒకవేళ ఏదైనా అపాయం కలిగితే వెంటనే ఏం చేయాలో ముందుగానే ఆలోచించుకుని ఉండాలి. అగ్ని ప్రమాదాలను నిరోధించేందుకు తగు పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలి.

ఇన్ని జాగ్రత్తలూ ఎందుకంటే, ఆ అపార్ట్‌మెంట్‌లలో ఉండేది మనలను కన్న తల్లులు, తండ్రులు, మన బిడ్డలు.. మన కుటుంబసభ్యులే. మొత్తంగా అందరూ మనలాంటివారేనని గుర్తుంచుకోవాలి. ఎవరికీ ఎవరూ సమస్య కాకుండా, మరొకరిని కష్టపెట్టకుండా, అందరూ కలిసి ఒకే కుటుంబసభ్యుల్లా మనుగడ సాగించాలి. నిబంధనలు పాటిస్తూ, ఎలాంటి ప్రమాదాలు దరిచేరకుండా చూసుకున్నప్పుడే అపార్ట్‌మెంట్లు మనపాలిట నిజంగానే వరాలవుతాయి.

## కళారంగం కళా విహీనం.. కళాకారుల బ్రతుకులు దీనం!

సమాజాన్ని అత్యంత ప్రభావితం చేయగలిగిన రంగం కళారంగం. ప్రజలని చైతన్యవంతుల్ని చేయగల సమర్థత కలిగిన వ్యక్తులు కళాకారులు. అది నాటిక అయినా, నాటకం అయినా, కళారూపమైనా లేదా మరే ఇతర కళా రూపంతోనైనా తాము చెప్పదలుచుకున్న అంశాన్ని మంచైనా, చెడైనా సరాసరి జనం మనసులలోకి చొప్పించగలిగిన గొప్పదనం ఒక్క కళాకారులకే ఉంది.

ఇక బుల్లి తెర, వెండితెర రంగాల ప్రభావం కూడా నేటి సమాజం పట్ల ఎంత ఎక్కువగా ఉందో ప్రత్యేకంగా వేరే చెప్పనక్కర లేదు. ఆధునిక సమాజంలో విలనిజాన్ని ప్రదర్శిస్తున్న నేటి మహిళలంతా టీవీల్లో వస్తున్న సీరియల్స్ పుణ్యమా అంటూ తయారైన వాళ్ళే. 90శాతానికి పైగా సీరియళ్ళలో మగవాళ్ళని దద్దమ్మలుగా చేసి చూపిస్తూ ఆడవాళ్ళ ఆధిపత్యాన్ని, పైశాచికత్వాన్ని ప్రధాన అంశంగా చేసి చిత్రీకరిస్తున్నారు. అందుకోసమే కాబోలు ఆ సీరియళ్ళు ఆడవాళ్ళకి తెగ నచ్చేస్తున్నాయి.

వెండితెర విషయానికి వస్తే... సినిమా రంగం ముఖ్యంగా యువతపై ఎక్కువ ప్రభావం చూపుతుంది. ఆ సినిమాలో హీరో కష్టపడి పైకెదిగితే యువత ఆ స్ఫూర్తినే తీసుకుంటుంది. అలా కాకుండా పుష్ప సినిమాలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేసి తమ అభిమాన నటుడు హీరోయిజాన్ని ప్రదర్శిస్తే... అతనినే అనుసరించి తాము కూడా ఎర్రచందనం దుంగల దొంగలుగా మారడానికి సైతం కొంత శాతం యువతరం మొగ్గు చూపిస్తుంది. వాస్తవ ప్రపంచంలో నేరం అన్నది ఎంతటి ప్రమాదకరమో, అది తమ జీవితాన్ని ఛిద్రం చేయడంతో పాటు తమ కుటుంబాన్ని ఎంతటి చిన్నాభిన్నం చేస్తుందో వారికి అవసరం లేదు. తమ హీరో చేశాడు... కాబట్టి, తామూ చేయాలి.

రెండు తెలుగు రాష్ట్రాలని కలిపి చూసినా వందల సంఖ్యలో కళా సంస్థలు ఉంటే, వేలల్లో మాత్రమే కళాకారులు ఉంటారు. కానీ, వాళ్ళ ప్రదర్శనలలో నటన ద్వారా కొన్ని లక్షల మంది ప్రజలని ప్రభావితం చేయగలరన్నది మాత్రం ఎవ్వరూ కాదనలేని నిజం. ఇక్కడ బుల్లి తెర, వెండి తెరలపై నటించే కళాకారులతో స్టేజి ఆర్టిస్టులని, వాళ్ళని ప్రోత్సహించే కళా సంస్థల్ని పోల్చిచూస్తే టీవీ, సినిమా ఆర్టిస్టుల జీవితాలు చాలా మెరుగ్గా ఉంటాయి. సీరియళ్ళు, సినిమాలు పెట్టుబడి, రాబడి వంటి లెక్కలతో నిర్మిస్తారు. అందుకు తగ్గట్టుగా నటీనటుల ఎంపిక ఉంటుంది. వారికి ఎవరికి తగ్గ స్థాయిలో వారికి వేల నుండి కోట్ల రూపాయల వరకూ పారితోషికాలు ఉంటాయి. ఉదాహరణకి ఇటీవల విడుదలైన రజనీకాంత్ నటించిన 'జైలర్' అనే సినిమా అనేక భాషల్లో సంచలనం సృష్టించి నిర్మాతకి వందలకోట్లు సంపాదించి




పెట్టింది. ఒక్క రజనీ కాంత్ రెమ్యూనరేషనే 240 కోట్లని సామాజిక మాధ్యమాలలోవార్తలు వచ్చాయి. అంటే ఇక ఆ చిత్ర నిర్మాత ఏ స్థాయిలో లాభపడి ఉంటాడో మనం ఊహించలేం.

సీరియళ్ళు, సినిమాలు వాటి నటీనటుల రాబడి అలా ఉంటే, గ్రామస్థాయి నుండి మహానగరాల స్థాయి వరకు కళలే జీవనోపాధిగా చేసుకుని బ్రతుకుతున్న వేలాది మంది స్టేజి కళాకారులు పూట గడవక అల్లాడుతున్నారన్నది అక్షర సత్యం.

రజకులకి, దర్జీలకి, పాస్టర్లకి, పూజారులకి, ఆటో, టాక్సీ ఓనర్లకి, బెస్తవారికీ, చేనేత కార్మికులకు.... ఇలా అదీ ఇదీ అన్న వ్యత్యాసం లేకుండా అన్ని రంగాల వారికీ బటన్ నొక్కడం ద్వారా లక్షల కోట్ల రూపాయలు వారి ఖాతాలో జమచేస్తున్న వైసీపీ ప్రభుత్వం పేద కళాకారులని, కళా సంస్థల్ని గాలికి వదిలేసింది. కళారంగాన్ని ఉద్ధరించడానికి ప్రత్యేకంగా సాంస్కృతిక విభాగం, దానికి క్యాబినెట్ హోదా కలిగిన ఒక ఛైర్మెన్, ఐఏఎస్ స్థాయి అధికారి పర్యవేక్షణ అన్నీ ఉన్నా.. పేద కళాకారుల బ్రతుకులు మాత్రం దయనీయంగా తయారయ్యాయి. తమ నటనా ప్రావీణ్యంతో ప్రేక్షకుల చప్పట్లు అంటుకున్న కళాకారులెందరో జీవనోపాధి లేక ఇక్కట్లపాలవుతున్నారు. తమ ప్రతిభని పక్కన పెట్టి కూలి పనులు చేసుకుంటున్నారు. ఆంధ్ర ముఖ్యమంత్రి జగన్ కళలన్నా, కళాకారులన్నా ఎందుకనో తొలినుండి అసహనాన్ని, అయిష్టతని ప్రదర్శిస్తున్నారు. తనని కలవడానికి వచ్చిన సినీ దిగ్గజాల పట్ల జగన్ వ్యవహరించిన తీరు ఆర్టిస్టుల పట్ల జగన్ వైఖరిని స్పష్టం చేసిందన్న విమర్శలు అప్పట్లో బాగా వినిపించాయి.

కోట్ల రూపాయలు ఆర్జించే సినీనటుల పట్ల ముఖ్యమంత్రి ఎలాంటి అభిప్రాయం కలిగివున్నా అది ఆయన వ్యక్తిగతం. కానీ, కళలే తమ జీవనాధారంగా చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్న వారిని నిర్లక్ష్యం చెయ్యడం తగదు. వారికి భిక్షం ఇవ్వనక్కర లేదు. వారి ప్రతిభని, నైపుణ్యాన్ని ప్రభుత్వ పథకాల కోసం వాడుకోవచ్చు. ప్రతి నియోజకవర్గంలో ప్రచార రథాల ద్వారా వేదికలను ఏర్పాటు చేసి నవరత్నాలకి ప్రచారం చేసుకోవచ్చు, మళ్ళీ జగనే ఎందుకు కావాలో చెప్పించుకోవచ్చు, ప్రతిపక్షాల వైఫల్యాలను ఎత్తి చూపించొచ్చు... ఇలా వారికి భృతిని కల్పించవచ్చు, తాము లబ్ది పొందవచ్చు. కళారంగాన్ని, కళాకారులని చేరదీసి ఆదరించడం అన్న సంస్కృతీ, సంప్రదాయం రాజులకాలం నుండి వస్తున్న ఆచారం. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన కాంగ్రెస్, కళాకారుడు స్థాపించిన టీడీపీ, హిందుత్వ భావజాలం కలిగిన బీజేపీ, సిద్ధాంత పార్టీలు సీపీయం, సిపిఐ ఇలా అన్ని పార్టీలు కళాకారులను తమ ప్రచారం కోసం ఉపయోగించుకుంటున్నాయి. వైసీపీ పాలనలోని ఒక్క ఆంధ్రాలో మాత్రం కళారంగం విహీనమై, కళాకారుల బ్రతుకులు దీనమయ్యాయి!

- రాజశ్రీ

## పవర్ స్టార్ గురించి పవర్‌ఫుల్‌గా చెప్పారు

గతవారం మన 'లాయర్'లో ప్రధాన శీర్షికలో రాసిన 'పవన్ చెవిలో కమలం పువ్వు' చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. వాస్తవాలను అరటిపండు వలచి పెట్టినట్లుగా చెప్పడంలో 'లాయర్'కి 'లాయరే' సాటి. సినిమా రంగంలో అంతటి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న స్థాయికి ఎదిగిన పవన్ కళ్యాణ్ రాజకీయాలలో జోకర్‌గా మారుతున్నారు. రాజకీయ అజ్ఞానిగా వ్యవహరిస్తున్నారు. గత పది సంవత్సరాలుగా ఒక ప్రాంతీయ పార్టీ వ్యవస్థాపకుడిగా రాజకీయాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ కూడా ఆయనలో పరిపక్వత రావడంలేదు. సంయమనం కోల్పోయి బహిరంగసభల్లో కూడా కెమెరా ముందు నటించినట్లు ప్రవర్తిస్తున్నారు. రేపు తెలంగాణలో కూడా 2019లో ఆంధ్రాలో ఎదురైనా అనుభవమే ఎదురై డిపాజిట్లు గల్లంతైతే, చంద్రబాబు కూడా పవన్ బాబుని బఫూన్‌ని చేసి వాడుకుంటారు. రాజకీయాలలో జనం వేసే ఈలలు, వాళ్ళు కొట్టే చప్పట్లు ప్రధానం కాదు, ఎన్నికల సమయంలో వాళ్ళు గుద్దే ఓట్లే కీలకం. ఆ నిజాన్ని జనసేనాని గుర్తిస్తే మంచిది!

- యం. చంద్రమౌళి, కొత్త ఢిల్లీ.




## పాచిపడుతున్న ట్యాంకులు

జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఉన్న తాగునీటి ట్యాంకులను తరచూ శుభ్రం చేయాల్సి ఉన్నా, సంబంధిత సిబ్బంది పట్టించుకోవడం లేదు. వాటర్‌ట్యాంకులను కనీసం ఆరునెలలకో సారైనా బ్లీచింగ్ వేసి శుభ్రం చేసి, ఆరబెట్టి, నీళ్లు నింపాలి. అయితే, సంవత్సరాలు గడిచిపోతున్నా వాటిని శుభ్రం చేస్తున్న దాఖలాలు లేవు. దీంతో అవి పాచి పట్టి, అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. వాటినుండి వచ్చే నీళ్ళు తాగితే అనారోగ్యమే కదా! సంబంధిత అధికారులు ఇకనైనా పట్టించుకోవాలి.

వై.కె సుబ్బన్న, ఉదయగిరి.

## అజయ్‌బాబుకు అభినందన

ఒకసారి..రెండుసార్లు కాదు, ఏకంగా వందసార్లు రక్తదానం చేసి ఎందరో అభాగ్యులను, బాధితులను, రోగులను ఆదుకుంటున్న రక్తదాత అజయ్‌బాబు ఎంతైనా అభినందనీయుడు. తనది 'ఏ2+' రకానికి చెందిన రక్తం. తన తండ్రి రక్తసహాయకుడు.. సింహపురి స్వచ్ఛంధ రక్తదాతల బృందం సహాయ కార్యదర్శి కీర్తిశేషులు నారాయణ గారు. తండ్రి నుండి ప్రేరణ పొందిన అజయ్‌బాబు కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడు, 1986 సెప్టెంబరు 30న సింహపురి రక్త దాతల బృందంలో సభ్యులయ్యారు. 1987 మార్చి 10న తొలి సారి రక్తదానం చేశారు. ఈనెల 7వ తేదీన నూరవసారి రక్తమిచ్చారు. తనకు సింహపురి సంస్థ ప్రేరణ అంటుంటారాయన. అజయ్‌బాబుకు అభినందనలు.

తిక్కవరపు సుకుమార్‌రెడ్డి,
కార్యదర్శి, సింహపురి స్వచ్ఛంధ రక్తదాతల బృందం, 'ఓ-'

# ఎట్టకేలకు రైతాంగానికి సాగునీళ్ళు

- 2.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటి విడుదల
- ఈనెల 20 నుండి పంటపొలాలకు సోమశిల జలాలు
- ఐఏబీ సమావేశంలో నిర్ణయం



**ఎట్టకేలకు జిల్లా రైతాంగం ఎప్పుడెప్పుడా అని ఆశగా ఎదురుచూస్తున్న సాగునీళ్లు అందనున్నాయి. ఈనెల 20వ తేది నుంచి సోమశిల జలాలు పంటపొలాల్లోకి రానున్నాయి. వర్షాభావంతో పంటలు వేసుకోలేక అవస్థలు పడుతున్న రైతులకు ఇది శుభవార్త. వ్యవసాయానికి అదునుకు పదునైన వర్షాలు లేక, జిల్లావ్యాప్తంగా కరువు పరిస్థితులు అలముకుంటున్న పరిస్థితుల్లో సేద్యానికి దిగలేక, మరోవైపు వ్యవసాయ సీజన్ గడువు ముగుస్తుండడంతో ఏంచేయాలో దిక్కుతోచక అల్లాడుతున్న రైతులు ఇప్పుడు కాస్త తెరిపిన పడ్డారు. జిల్లా సాగునీటి సలహా బోర్డు (ఐఏబీ) సమావేశంలో తీసుకున్న నిర్ణయాలతో వారు ఇక సేద్యానికి సమాయత్తం కానున్నారు.**

జిల్లాలో ప్రస్తుతం ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకుని, ఈ రబీ సీజన్‌లో పెన్నా డెల్టా క్రింద సుమారు రెండు లక్షల 20వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేలా ఈనెల 14న నెల్లూరులోని జడ్పీ సమావేశమందిరంలో జరిగిన జిల్లా సాగునీటి సలహా బోర్డు సమావేశంలో నిర్ణయించారు. జిల్లా కలెక్టర్ హరినారాయణన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో సోమశిల, కండలేరు జలాశయాల ఆయకట్టు కింద మొదటి పంటకు సాగునీరు అందించేందుకు కమిటి తీర్మానించినట్లు తెలిపారు. నీటి లభ్యతను బట్టి డెల్టాయేతర ప్రాంతానికి కూడా సాగునీరు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఈ నెల 20వ తేదీ నుండి సాగునీరు విడుదలచేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో వ్యవసాయ శాఖ, జల వనరుల శాఖలను సమన్వయం చేస్తూ త్రాగునీటి అవసరాలను కూడా తీరుస్తూ... సాగునీటిని సమర్థవంతంగా సద్వినియోగం అయ్యేలా చేస్తామన్నారు. ప్రస్తుతం సోమశిల ప్రాజెక్ట్‌లో ఉన్న నీటి లభ్యతను సమర్థవంతంగా వినియోగించుకుంటూ పెన్నా డెల్టా ఆయకట్టు రైతులకు ప్రాధాన్యత ఇస్తూ సాగునీరు విడుదల చేయాలని కోవూరు శాసనసభ్యులు నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి సూచించారు. సాగునీటితో పాటు త్రాగునీటికి ప్రాధ్యాన్యత ఇవ్వాలన్నారు. అవసరమైతే డెడ్ స్టోరేజీని ఇంకా తగ్గించే అంశాన్ని పరిశీలించాలని కూడా ఆయన సూచించారు. పెన్నా డెల్టా పరిధిలోని అల్లూరు, దగదర్తి మండలాల్లోని రైతులు నారుమడులు వేయడం జరిగిందని, వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. కందుకూరు ప్రాంత రైతాంగానికి రాళ్ళపాడు ప్రాజెక్ట్ ప్రధాన రిజర్వాయర్ అని, సోమశిల ప్రాజెక్ట్ నుండి ఈ ప్రాజెక్టుకు 1.5 టి.ఎం.సిల నీటిని కేటాయించడం జరిగిందని, ఆ నీటిని సక్రమంగా విడుదల చేయాలని, అలాగే రాళ్ళపాడు ప్రాజెక్ట్ పరిధిలోని అనేక చెరువులకు మరమ్మత్తులు చేయించాల్సిన పరిస్థితి ఉంది కనుక పరిశీలించాలని కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి కోరారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మెన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబు రెడ్డి, కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, శాసనమండలి సభ్యులు బల్లి కల్యాణ్ చక్రవర్తి, జిల్లాలోని నీటి యాజ్యమాన్య సంఘాల ప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు చంద్ర రాజగోపాల్, పి.రాధాకృష్ణయ్య, పి.శ్రీరాములు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

### ఇద్దరు ఎమ్మెల్యేల వాకౌట్ :

ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల గత రెండు వ్యవసాయ సీజన్‌లలో దాదాపు 30 టీఎంసీల నీటిని వృధా చేశారని, అధికారులు చేసిన తప్పులకు ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఎంతగా అడిగినా అధికారులు తామడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పడం లేదని నిరసన వ్యక్తం చేస్తూ వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి సమావేశం నుంచి వాకౌట్ చేయగా, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆయన్ను అనుసరించారు.

# బీసీల కోసం జగన్ చేసిందేమీ లేదు

**పోలంరెడ్డి దినేష్‌రెడ్డి**



బీసీలను మభ్యపెట్టడం తప్ప, రాష్ట్రంలో బీసీల సంక్షేమం కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేసిందేమీ లేదని కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి విమర్శించారు. ఇటీవల ఆయన విడవలూరు మండలం అన్నారెడ్డిపాళెం పంచాయతీలో జరిగిన 'ప్రతి అడుగు ప్రజల కోసం' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్ ఏమి చేశారని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. కులవృత్తి మీద సెస్సు కట్టే ఒకే కులం గౌడ కులమని, అయితే ప్రభుత్వం మాత్రం గౌడ కుల సంక్షేమం మరచిపోయిందని దుయ్యబట్టారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పాలనలోనే బీసీల అభ్యున్నతికి కృషి జరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో బీసీల సంక్షేమానికి 80 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని, ప్రత్యేక ఆర్థిక విధానాలతో బీసీలను ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే నని ఆయన అన్నారు. గౌడ కుల సంక్షేమానికి, కల్లు గీత కార్మికుల శ్రేయస్సుకు టీడీపీ హయాంలో ప్రత్యేక పథకాలు ఉండేవని, 50ఏళ్లకే పింఛన్లు ఇచ్చి ఆదుకోవడం జరిగిందని, ఎప్పటికప్పుడు లైసెన్సులు రెన్యువల్ చేసి, కొత్త లైసెన్సులు ఇచ్చి గీతకార్మికులకు చేయూత నిచ్చారని అన్నారు. ఇప్పుడు కల్లు గీత కార్మికులు ఏ పథకాలూ లేక, అనేకరకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు వస్తారని, రానున్న ఎన్నికల్లో విజయం సాధించి తీరుతారని, బీసీల సామాజిక అభివృద్ధి కోసం కృషిచేస్తారని ఆయన ప్రజలకు వివరించారు.

# సహకార వారోత్సవాలు

నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో నవంబరు 14న 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొని సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. వారం రోజులపాటు నిర్వహించే సహకార వారోత్సవాల్లో సహకార బ్యాంకుల సేవలను విస్తృతంగా ప్రచారం చేయాలని, బ్యాంకు అందిస్తున్న సేవలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. సహకార బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణాలు మంజూరుచేస్తూ రైతుకు అండగా నిలుస్తున్నాయని చెప్పారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకును లాభాలబాట పట్టించిన ఛైర్మెన్ కామిరెడ్డి సత్యనారాయణను, పాలకమండలి సభ్యులను, అధికారులను మంత్రి అభినందించారు. కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, బ్యాంకు సీఇఒ సరిత, జిల్లా సహకారశాఖ అధికారి సుధాభారతి, నాబార్డ్ జీఎం రవిసింగ్, డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్, ముక్కాల ద్వారకానాథ్ తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకాల ద్వారానే విజ్ఞానం

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రోజు రోజుకీ విస్తరిస్తూ కొత్త పుంతలు తొక్కుతున్నప్పటికీ, సమగ్ర విషయ సముపార్జన మాత్రం పుస్తకాల ద్వారానే సాధ్యమని, విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటుగా మార్చుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నవంబరు 14న నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తొలుత, దేశ ప్రథమ ప్రధాని చాచానెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నెహ్రూజీ చిత్రపటానికి పూలమాల వేసి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ కామాక్షిదేవి మాట్లాడుతూ, విద్యార్థులు

## ○ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ శారద



పాఠ్యపుస్తకాలు మాత్రమే కాకుండా, చరిత్ర గురించి తెలియజేసే పుస్తకాలు చదవడం కూడా అవసరమన్నారు. ప్రతిరోజు ఓ కొత్త పుస్తకం చదవాలనే జిజ్ఞాస ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. నవంబర్14 నుండి 20వతేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, 15న ప్రారంభమయ్యే పుస్తక ప్రదర్శన వారోత్సవాల ముగింపువరకు కొనసాగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా చెప్పారు. 16న గ్రంథాలయ ఉద్యమంలో కృషిచేసిన మహనీయుల్ని స్మరించుకునే కార్యక్రమం ఉంటుందని, 17న కవి సమ్మేళనం, 18న వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని, 19న మహిళా సాధికారతపై చర్చాగోష్ఠి, 'దిశా' చట్టం అమలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, 20వ తేదీన ముగింపు కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన వివరించారు. అనంతరం కుమారి కషిష్ చేసిన భరతనాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో డెప్యూటీ లైబ్రేరియన్ ప్రసాద్, జిల్లాలోని వివిధ ప్రాంతాల గ్రంథాలయాల పాలకులు, పలువురు ఉపాధ్యాయులు, బాలబాలికలు పాల్గొన్నారు.

# ఆదర్శమూర్తి నెహ్రూజీ

నవంబరు 14న నెల్లూరులో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. నగర మేయర్ స్రవంతి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. తొలుత, స్థానిక మద్రాస్ బస్టాండ్ కూడలిలోని జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మన దేశ మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజైన నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నామని ఈ సందర్భంగా మేయర్ అన్నారు. ప్రధానమంత్రిగా సేవలందించిన నెహ్రూ తనదైన దార్శనికత, ముందుచూపుతో దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపించారని, చిన్నారులను ఆప్యాయంగా పలకరించి, వారికి బహుమతులు అందజేసి బాగా చదువుకోవాలని ప్రోత్సహించేవారని, చిన్న పిల్లలు కూడా నెహ్రూ అంటే గొప్ప అభిమానాన్ని చూపేవారని అన్నారు.

# ఆజాద్ సేవలు మరువలేనివి

ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. మౌలానా జయంతిని పురస్కరించుకుని ఇటీవల తన క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతిపిత గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా ఆయన దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారన్నారు. స్వాతంత్ర్యానంతరం భారత ప్రథమ విద్యాశాఖ మంత్రిగా, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా దేశానికి ఎనలేని సేవచేశారని కొనియాడారు. విద్య యొక్క ప్రాధాన్యతను గుర్తించి విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని చాటిచెప్పిన గొప్ప దార్శనికుడు మౌలానా అబుల్‌కలాం ఆజాద్ అని ఆయన కొనియాడారు. వారి జన్మదినాన్ని మైనార్టీ సంక్షేమదినంగా, జాతీయ విద్యాదినోత్సవంగా ప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు. ఆ మహనీయుని ఆదర్శంగా తీసుకుని వారి ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు.

## నెల్లూరు కబుర్లు

# యువత పైనే..దేశ భవిత

**-- ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ నాగసాయి సూరి --**



నెహ్రూ యువ కేంద్ర ఆవిర్భావ దినోత్సవం నవంబరు 14న నెల్లూరులోని శ్రీ వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో ఘనంగా జరిగింది. దేశ భవిష్యత్తు యువత మీదనే ఆధారపడివుందని, ప్రతిఒక్కరూ అవకాశాలను సద్వినియోగం చేసుకుని దేశాభ్యున్నతికి కృషి చేయాలని ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ నాగసాయి సూరి పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్ర సంఘటన్‌ను 1972 నవంబర్14న ఏర్పాటు చేయడం జరిగిందని, దేశంలోని 29 రాష్ట్రాలు, 623 జిల్లాలలో నెహ్రూ యువకేంద్ర కార్యకలాపాలు కొనసాగిస్తోందని జిల్లా యువజన అధికారి ఏ.మహేంద్రరెడ్డి తెలిపారు. యువతకు అవసరమైన అవగాహన కార్యక్రమాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాలు చేపడుతూ వ్యక్తి వికాసానికి, దేశ అభివృద్ధికి యువతను సంసిద్ధం చేయటం నెహ్రూ యువ కేంద్ర ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, జయప్రకాష్, వెంకటేశ్వర్లు, గీత తదితరులు పాల్గొన్నారు.

## మూలస్థానేశ్వరాలయంలో అఖండ దీపారాధన

కార్తీకమాసం సందర్భంగా నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో ఈనెల 14వ తేది రాత్రి ఆకాశదీపోత్సవాన్ని నిర్వహించి, అఖండ దీపారాధన చేశారు. అనంతరం స్వామివారికి వెండి నందిసేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఇస్కాన్ మందిరంలో.. గోవర్ధన పూజ

నెల్లూరు, ఇస్కాన్ మందిరంలో ఈనెల 14వ తేది రాత్రి మందిరం అధ్యక్షుడు డా. శుకదేవస్వామి ఆధ్వర్యంలో గోవర్ధన పూజను నిర్వహించారు. తొలుత గోమాతలకు పూజలు చేశారు. అనంతరం మందిరంలో కొలువైవున్న శ్రీ బలరామ, శ్రీకృష్ణ భగవానులకు, సుభద్రాదేవి అమ్మవారికి శోభాయమానంగా అలంకారాలు చేసి కొలువుతీర్చారు.

# భక్తులకు దీక్షా వస్త్రాలు



## • శివారాధకులు ఆల్తూరు గిరీష్‌రెడ్డి వితరణ

శివారాధనకు ఎంతో పవిత్రమైన కార్తీకమాసంలో అత్యంత భక్తిశ్రద్ధలతో "హర హర మహాదేవ శంభో శంకర" అంటూ శివదీక్ష చేసే భక్తుల సంఖ్య ఏ ఏడాదికాఏడాది పెరిగిపోతోంది. జిల్లాలోనే అత్యంత పురాతనమైన దేవాలయంగా చరిత్ర ఉన్న శ్రీ మూలస్థానేశ్వర ఆలయానికి 2012 సంవత్సరంలో ఆధ్యాత్మిక తత్పరుడు, వ్యాపారవేత్త కీర్తిశేషులు ఆల్తూరు ఆదినారాయణరెడ్డి కుమారుడు ఆల్తూరు గిరీష్‌రెడ్డి ధర్మకర్తల మండలి ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటినుండి ఈ శివమాల ధారణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆ తర్వాతి కాలంలో ఈ మాలధారణ అత్యంత ప్రాముఖ్యతను, ప్రాశస్త్యాన్ని సంతరించుకుంది. ప్రారంభ దశలో పదుల సంఖ్యలో ఉన్న భక్తులు, ఇప్పుడు వందల సంఖ్యకు చేరారు. ఈ ఏడాది ఆ సంఖ్య వెయ్యి దాటిపోతుందని ఆలయ వర్గాలు తెలిపాయి. తాను ఛైర్మెన్‌గా ఉన్నప్పటి నుండి శివమాల ధారణ భక్తులకు మాల, వస్త్రాలు ఉచితంగా అందజేసే సంప్రదాయాన్ని ప్రారంభించిన ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, తాను పదవీ విరమణ పొందినా... ఆ ఆనవాయితీని మాత్రం కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా ఈనెల 14న కార్తీకమాసం ప్రారంభోత్సవం సందర్భంగా నెల్లూరు మూలాపేటలోని మూలస్థానేశ్వర ఆలయ ప్రాంగణంలో శివదీక్షా వస్త్రాలను, మాలను భక్తులకు ఉచితంగా అందజేశారు. కార్తీక మాసం తొలిరోజున సుమారు 500 మంది భక్తులకు దీక్షా వస్త్రాలను, మాలలను ఆల్తూరు గిరీష్‌రెడ్డి పంపిణీ చేశారు. మరో 500మందికి త్వరలోనే వస్త్రాలను అందజేస్తామని ఆయన చెప్పారు. ఈ దీక్ష కొనసాగే నెలరోజులూ మాల ధరించిన శివభక్తులందరికీ ప్రతి రోజూ సాయంత్రం ఆలయ ప్రాంగణంలో అల్పాహారం అందజేస్తారు. చివరిరోజైన 30వ రోజు శివమాల ధారణ భక్తులంతా నగరంలోని రంగనాథస్వామి దేవస్థానం నుండి 12 కలశాలతో ఊరేగింపుగా బయలుదేరి మూలాపేటలోని శివాలయం వద్దకు చేరుకుంటారు. పంచాక్షరి పఠనంతో ఆలయ పరిసర ప్రాంతాలను మార్మోగిస్తారు. అనంతరం తాము తెచ్చిన కలశాలతో శివయ్యకు అభిషేకం చేస్తారు. ప్రతి సంవత్సరంలాగే ఈ యేడాది కూడా ఈ కార్యక్రమాలన్నీ నిర్వహిస్తామని గిరీష్‌రెడ్డి తెలిపారు. మూలస్థానేశ్వరాలయం ఇఓ ఆరంబాకం వేణుగోపాల్, భాస్కర్‌రెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకట శేషారెడ్డి, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నెహ్రూజీ సేవలు నిరుపమానం

**- డీసీసీ నేత చేవూరు**



దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరుగని సేవలందించిన నెహ్రూజీ ఆశయాల బాటలో అందరూ నడవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. నవంబరు 14న నెహ్రూజీ జయంతిని పురస్కరించుకుని నెల్లూరులోని మద్రాసు బస్టాండ్ కూడలిలో ఉన్న నెహ్రూజీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేవూరు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల నుంచి దేశానికి విముక్తి కలిగించి దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సాధించడంలో నెహ్రూజీ కీలకపాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సీవీ శేషారెడ్డి, తలారి బాలసుధాకర్, మోహన్, షేక్ ఫయాజ్, రమేష్, ఏటూరు శ్రీనివాసులురెడ్డి, కొండా అనిల్‌కుమార్, గణేష్‌బాబు, షేక్ అల్లావుద్దీన్, రాజా, మహిళా నాయకురాలు లత తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్

**- రావు శ్రీనివాసరావు**



నెల్లూరులోని వనంతోపు పొదుపు గ్రూప్స్ లీడర్ల సమాఖ్య సమావేశం వైకాపా నాయకులు మనోరమ ఆర్.వి ఆధ్వర్యంలో ఈనెల 11న జరిగింది. 20వ డివిజన్ ఇన్‌చార్జి, శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ రావు శ్రీనివాసరావు (ఆర్‌ఎస్‌ఆర్) ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎటువంటి ఇబ్బందులు లేకుండా నేరుగా లబ్ధిదారులకు ఇస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి అమోఘమని కొనియాడారు. అదేవిధంగా, నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ వైకాపా ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూరల్ నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం కల్పిస్తూ, 9 నెలలు కాలంలోనే రూ.150కోట్లతో వేగవంతమైన అభివృద్ధి చేస్తున్నారన్నారు. 20వ డివిజన్ వైకాపా కన్వీనర్లు చెవిరెడ్డి గోపాల్‌రెడ్డి, పోలంరెడ్డి నాగేశ్వర్ రెడ్డి, రావూరి నరసింహారెడ్డి, అంగన్‌వాడి టీచర్ రాణి పాల్గొన్నారు.

# 'తంగిరాల మహాభారతం' 81వ భాగం

ధృతరాష్ట్రుడు పాండవులకు తిరిగి రాజ్యం ఇవ్వగానే.. దుర్యోధనుడు అది సహించలేక పాండవుల వలన మనకు ప్రమాదం ఉందని, వారిని తిరిగి జూదానికి పిలిచి 12 ఏళ్ల అరణ్యవాసం, ఒక ఏడాది అజ్ఞాతవాసం పందెంగా నిర్ణయించి ఓడించాలని తండ్రిని ప్రార్థించగా... ధృతరాష్ట్రుడు, గాంధారి, కురువృద్ధుల మాటలు ఆలకించక ఒప్పుకొని ప్రాతికామిని పంపి ధర్మరాజును తిరిగి హస్తినాపురానికి రావాలని ఆహ్వానిస్తాడు.




ధర్మరాజు తమ్ముళ్లతోను, ద్రౌపదితోను తిరిగి హస్తినాపురం వచ్చి శకునితో జూదమాడి ఓడిపోతాడు. దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కర్ణుడు పాండవులను హేళనగా మాట్లాడినప్పుడు పాండవులు రాబోయే సమరంలో కౌరవులను మట్టుపెడతామని శపథాలు చేస్తారు. ఇక పాండవులు జంతు చర్మాలు ధరించి అరణ్యవాసానికి బయలుదేరుతారు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.

పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.




# ఖాదీ ప్రాధాన్యతను గుర్తించాలి



ప్రధాని నరేంద్రమోడీ పిలుపుమేరకు 'ఖాదీ ఫర్ నేషన్–ఖాదీ ఫర్ ఫ్యాషన్' నినాదంతో నెల్లూరు దర్గామిట్టలోని జడ్పీ ఉన్నతపాఠశాలలో సమగ్రశిక్ష అధికారులు ఈనెల 14న ఖాదీ మహోత్సవం నిర్వహించారు. సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి జి.సుధీర్‌బాబు మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంలో ఖాదీ దుస్తుల ప్రాధాన్యతను తెలియజెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సిఎంఓ కె.పెంచలయ్య, డిసిఇఓ కార్యదర్శి రామ్‌కుమార్, ఎంఇఓ హమీద్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో అలసత్వం వద్దు

విధి నిర్వహణలో అలసత్వం వద్దని, వినియోగదారుల పట్ల ఏమాత్రం అలక్ష్యంగా వ్యవహరించినా చర్యలు తప్పని విద్యుత్‌శాఖ డెప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధుసూదన్‌రెడ్డి విద్యుత్‌శాఖ సిబ్బందిని హెచ్చరించారు. ఈనెల 14న ఆయన నగరంలోని వెంకటేశ్వరపురం, జనార్ధన్‌రెడ్డికాలనీ, భగత్‌సింగ్ కాలనీల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి తగు సూచనలిచ్చారు. వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని చెప్పారు.



# వేగూరులో అభివృద్ధి పనులు

## ప్రారంభించిన వేమిరెడ్డి, ప్రసన్న

కోవూరు నియోజకవర్గంలోని వేగూరు పంచాయతీ పరిధిలో ఈనెల 10న రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకాపా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, పలువురు వైకాపా నాయకులు 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లతో కలిసి పార్టీ జెండాని ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో ప్రజల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమపథకాలు చేపట్టారని, పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో జగన్ వస్తేనే ఆంధ్రప్రదేశ్ మరింత వృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. అనంతరం, వేగూరు పంచాయతీలో రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మంజూరుచేసిన ఎంపీ నిధులు రూ.30 లక్షలతో సీతారామపురం ఎస్టీ కాలనీ, రామాపురం ఎస్టీ కాలనీల్లో అభివృద్ధి పనులకు, వేగూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లకు వారు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం శ్రీ కామాక్షిదేవి సమేత శ్రీ కైలాసనాధస్వామి దేవస్థానం పునర్నిర్మాణం కోసం రూ.కోటీ 30 లక్షల వ్యయంతో చేపట్టనున్న నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కోవూరు నియోజకవర్గ యువజన కమిటీ అధ్యక్షులు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నెల్లూరు కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ పి.రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా..

# ఆకాశ దీపం



కార్తీకమాసం ప్రారంభం కావడంతో దేవాలయాల్లో విశేష పూజలు ప్రారంభమయ్యాయి. ఈనెల 13వ తేదీ రాత్రి నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలోని శ్రీ సుందరేశ్వరస్వామి సన్నిధిలో ఆకాశ దీపాన్ని ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధ్వజస్తంభా నికి కూడా విశిష్టపూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ రత్నం జయరామ్, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఏవీ శ్రీనివాసులురెడ్డి, శ్రీ రాజరాజేశ్వరిదేవి సేవా సమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఆల్తూరు సులోచనమ్మ, ఆలయ ధర్మకర్తలు దొరబాబు, రామ్మోహన్‌రెడ్డి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక క్షేత్రంగా గణేష్ ఘాట్

## స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్



నెల్లూరు నగరంలో గణేష్ ఘాట్ ఆధ్యాత్మిక క్షేత్రంగా అభివృద్ధి చెందుతోందని స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, భారత పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె దీపా వెంకట్ అన్నారు. ఇటీవల ఆమె శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్దనున్న గణేష్ ఘాట్‌ను, నెల్లూరు చెరువు ప్రాంతాలను సందర్శించారు. నెల్లూరులోని సింహపురి కార్తీకదీపం సమితి పక్షాన కార్తీక పూర్ణిమ సందర్భంగా ఈనెల 26వ తేదీ ఆదివారం మహా కార్తీక దీపోత్సవం జరిగే కార్యక్రమాలను ఆమె ఈ సందర్భంగా పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, స్వర్ణభారత్ ట్రస్ట్ తరఫున గణేష్ ఘాట్ అభివృద్ధిలో తమ పాత్ర ఉంటుందన్నారు. పురాతనమైన స్వర్ణలింగేశ్వర స్వామి దేవస్థానం జీర్ణోదరణ చేపడతామని, పూర్తిస్థాయిలో ఆధ్యాత్మిక కార్యక్రమాల కోసం గణేష్ ఘాట్‌ను తీర్చిదిద్దే ప్రక్రియను ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సింహపురి కార్తీక దీపోత్సవ సమితి అధ్యక్షులు డాక్టర్ కె.వెన్నెల, కార్యదర్శి మల్లిక, కోడూరు జయప్రద, ముక్కాల ప్రసాద్, ఏవిఆర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర వ్రతం

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 12వ తేది సాయంత్రం 6 గంటలకు శ్రీ కేదారేశ్వరస్వామి వారి వ్రతం జరిగింది. ఆలయ ఛైర్మెన్ రత్నం జయరామ్, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి తదితరులు పర్యవేక్షించారు.




జననం: 21.08.1930

మరణం: 19.11.2019

# చతుర్థ వర్ధంతి

మా ఇంటి దీపం, మా ఆరాధ్యదైవం

**శ్రీమతి చిట్టమూరు అనసూయమ్మ(బుజ్జమ్మ) గారు**

(లేట్. చిట్టమూరు పద్మనాభరెడ్డి గారి సతీమణి, మనుబోలు)

మాకు దూరమై నవంబర్ 19, 2023 నాటికి

నాలుగేళ్ళు పూర్తికానున్న సందర్భంగా

ఆ మానవతామూర్తిని సంస్మరించుకుంటూ..

ఆమె దివ్య ఆత్మకు మా స్మృత్యంజలి ఘటిస్తున్నాము.

తమ్ముడు / అల్లుడు - కుమార్తె

**ప్రొ॥ సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల, చెన్నై**

కోడలు

**డా॥ సి.భారతి, యు.యస్.ఏ**

(W/o. లేట్. డా॥ సి.మధుసూదన్‌రెడ్డి)

మనుమరాలు, మనుమడు

**ప్రణీత అరవింద్, లోహిత్, యు.యస్.ఏ**

మనుమడు - మనుమరాలు

**డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి, చెన్నై**

మనుమరాలు - మనుమడు

**శ్రీమతి హారిత - డా॥ రామానందరెడ్డి, కాకినాడ**

మునిమనుమలు, మునిమనుమరాండ్రు

**జయేష్ & అష్మిత  కీర్తన లక్ష్మి & తనవ్**

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# గూడూరులో 'వందేభారత్' ఆగాలి

**- డిఆర్‌యుసిసి మెంబర్ శ్యామ్ యాదవ్**



గూడూరు శ్రీ కృష్ణ సేవాసమితి అధ్యక్షులు, సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ డిఆర్‌యుసిసి మెంబర్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ శ్యామసుందర రావు ఇటీవల విజయ వాడ డివిజన్ రైల్వే మేనేజర్ కాన్ఫరెన్స్ హాల్‌లో 132వ డిఆర్‌యుసిసి సమావేశం నిర్వహించారు. గూడూరు రైల్వేస్టేషన్‌కు అవసరమైన పలు మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. గూడూరు రైల్వేస్టేషన్‌లో 'వందే భారత్' రైలు ఆపాలని ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు.

# విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

**- లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మెన్ షేక్ రియాజ్ అహ్మద్**




గూడూరు, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిల్లకూరు మండలం, నల్లబెల్లి రెట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిల్డ్రన్స్ డే సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు లయన్ అక్కన రమణయ్య ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ మెంబర్ల సహాయ సహకారాలతో పదవ తరగతి చదువుతున్న 25 మంది విద్యార్థులకు స్టడీచైర్స్, రైటింగ్ ప్యాడ్స్‌ను అందించారు. లయన్స్ డిస్ట్రిక్ట్ ఛైర్మెన్ షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి దృక్పథంతో, క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అధ్యక్షులు ఆర్.రవిచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ పర్యటన నిమిత్తం వచ్చిన రీజియన్ ఛైర్మెన్ శరత్‌బాబు, సెక్రటరీ కే.శివయ్య, ట్రెజరర్ వీరేంద్రనాథ్, జోన్ ఛైర్మెన్ గురునాథం తదితరులు పాల్గొన్నారు.



## మినీ గురుకులంలో బాలల దినోత్సవం

గూడూరు రెండవ పట్టణంలోని మినీ గురుకులంలో బాలల దినోత్సవం పురస్కరించుకొని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షులు, రైల్వే డిఆర్‌యుసిసి మెంబర్ రొటీరియన్ బండి శ్యాంసుందర్‌రావు(మయూరి శ్యామ్ యాదవ్), గూడూరు మండల ఎంఈఓ–2లు పాల్గొన్నారు. అనంతరం మినీ గురుకులంలో ప్రతినెలా క్రమం తప్పకుండా చేసే సామూహిక జన్మదిన వేడుకలలో భాగంగా 9 మంది విద్యార్థునులకు భారీ కేకును కట్ చేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గురుకులం హెడ్మాస్టర్ మేరీ ప్రియత, ఏఈ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగులకు 'రెడ్' టపాసులు




గూడూరులోని రిహాబిలిటేషన్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ డిజేబుల్(రెడ్ సంస్థ) ఆధ్వర్యంలో దీపావళి పండుగను పురస్కరించుకొని ఇటీవల 40మంది పేద దివ్యాంగులకు టపాసులు, కొత్త బట్టలు, స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ న్యాయవాది మాజీ ఏపిపి గూడూరు వసంత్‌కుమార్, అతిథులుగా న్యాయవాది తీగల చంద్ర శేఖర్, బిల్డర్ చంద్రశేఖర్‌లు హాజరై దివ్యాంగులకి దీపావళి కానుకలు అందజేశారు.

## తల్లీ పిల్లలకు పోషకాహారం



లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజెపి సేవా కార్యక్రమాలలో భాగంగా ఇటీవల గూడూరు ప్రభుత్వాసుపత్రిలో పాస్ట్ జోన్ ఛైర్మెన్ మురళినాయుడు సహకారంతో తల్లీ పిల్లలకు పోషక ఆహారం, పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్ఎల్ఎన్ స్వామి, జోన్ ఛైర్మెన్ వై.గురునాథం, డాక్టర్ రాజా, ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజేంద్రప్రసాద్, రాధాకృష్ణారెడ్డి, పెంచల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



# హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



మండల కేంద్రమైన ముత్తుకూరులో ఇటీవల నాలుగు రోజుల పాటు కెజిఆర్ వాలీబాల్ టోర్నమెంట్–2023 పోటీలు హోరాహోరీగా జరిగాయి. బాలుర విభాగంలో జిఎస్‌టి–చెన్నై టీమ్ మొదటి బహుమతి సాధించగా, డేంజర్ బాయ్స్ టీమ్ ద్వితీయ బహుమతి కైవసం చేసుకుంది. ఎస్ఆర్ఎం తృతీయస్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో జీపీఆర్ యూనివర్శిటీ జట్టు మొదటి బహుమతి, పికేఆర్ టీమ్ రెండో బహుమతి, నేషనల్ అకాడమీ–ఈరోడ్ టీమ్ మూడో బహుమతిని గెలుచుకున్నాయి. మంత్రి కాకాణి చేతులమీదుగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన టీమ్‌లకు వరుసగా రూ.లక్ష, 70వేలు, 50వేలు వంతున నగదు పురస్కారాలు, మెమొంటోలను బహుకరించారు.

# కోలాహలంగా బాలల దినోత్సవ వేడుకలు



నవంబరు 14న బాలల దినోత్సవం సందర్భంగా నెల్లూరు, కొండాయపాళెం వద్ద ఉన్న నగర పాలక ప్రాథమిక పాఠశాలలో వేడుకలు జరిగాయి. మోటార్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్ కె.మురళీ మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాల ఆద్యుడు, ఐఐటీలు, ఐఐఎం వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలను స్థాపించిన మహనీయుడు, భారతదేశ మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు హరీష్, యోగా గురువు సహజానంద తదితరులు పాల్గొన్నారు.

## స్పాస్టిక్ సెంటర్‌లో :

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నెల్లూరుజిల్లాశాఖ ఆధ్వర్యంలోని ఎమ్మెస్సార్ స్పాస్టిక్ సెంటర్లో ఈనెల 14న బాలల దినోత్సవ వేడుకలు జరిగాయి. నెహ్రూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్పాస్టిక్ సెంటర్ సలహాదారు దాసరి రాజేంద్ర ప్రసాద్, కో–కన్వీనర్ నలుబోలు బలరామయ్యనాయుడు, ప్రిన్సిపాల్ గురునాధరావు ముఖ్యఅతిథులుగా పాల్గొని బాలలకు స్ఫూర్తినిచ్చే ప్రసంగాలు చేశారు. తలసేమియా విభాగం కో–కన్వీనర్ పర్వీన్, ప్యూర్ స్మైల్ చారిటీస్ వ్యవస్థాపకులు, లయన్స్‌క్లబ్ ఆఫ్ సంఘమిత్ర సభ్యులు పాల్గొని వివిధ ఆటల పోటీలలో విజేతలకు సుమారు రూ.5,700 విలువగల బహుమతులు అందజేశారు.

# ఏపీలో మోడీ + వైసీపీ = మోసీపీ!



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయం మోసీపీ (మోడీ నేతృత్వంలో నడుస్తున్న వైసీపీ అని)కి ప్రసిద్ధి చెందింది. కాబట్టి ఆంధ్ర రాజకీయాలు బీజేపీకి ఏ మాత్రం ముఖ్యం కాదు. దేశంలో ఎక్కడైనా ముస్లిం వాయిస్ గట్టిగా ఉంటేనే బీజేపీ ఉనికి ఉంటుంది. తెలంగాణలో "ఇది" గట్టిగానే ఉంది. అందుకే అక్కడ బీజేపీ ఉంది. గుజరాత్‌లో రెండువేల మంది ముస్లింలను సొరకాయలు కోసినట్టు ఊచకోత కోశారు. అందువల్ల అక్కడ బీజేపీ ఉంది. ఉత్తర్‌ప్రదేశ్‌లో ముస్లింల నుంచి హిందువులకు భయం ఉంది. అందుకని అక్కడ బీజేపీ ఉంది. అస్సాంలో, బెంగాల్‌లో, మహారాష్ట్రలో, రాజస్థాన్‌లో... వగైరా రాష్ట్రాల్లో ముస్లిం ప్రభావం బలంగా ఉంటే.. బీజేపీ ప్రభావం కూడా గట్టిగా ఉంటుంది. లేకపోతే లేదు.

తెలంగాణలో ఎంఐఎం ఉంది. అందుకని కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఉన్నారు. ఆంధ్ర సమాజంలో ముస్లిం ప్రభావం... హిందువులు భయపడాల్సినంతగా లేదు. అందుకని ఆంధ్రలో బీజేపీకి ఆదరణ లేదు. అటువంటి ఆంధ్రలో బీజేపీ అధ్యక్ష పదవికి కామరాజు అయితే ఏమిటి..., సోమరాజు అయితే ఏమిటి అన్నట్టుగా ఆ పార్టీ కేంద్ర నాయకులు వ్యవహరిస్తుంటారు. అందుకే సోము వీర్రాజును తీసేసి పురందేశ్వరిని పెట్టారు. ఆమెనూ రేపో... మాపో తీసేసి మరొకరిని పెట్టినా ఆశ్చర్యం ఏమీలేదు. రాష్ట్రంలోని అధికార వైసీపీ పార్టీకి ఆమె పెద్ద తలనొప్పిగా తయారయ్యారు. అందువల్ల, ఆమెను తీసేసి, వైసీపీకి నొప్పి కలగకుండా సన్నాయి నొక్కుల లాంటి విమర్శలతో కాలక్షేపం చేసే వారిని బీజేపీ అధ్యక్షులుగా నియమించినా ఆశ్చర్యం ఏమీలేదు.

ప్రధాని నరేంద్ర మోడీ ఏకైక లక్ష్యం... మూడోసారి ప్రధానమంత్రి కావడం అనడంలో ఎవరికీ సందేహం లేదు. ఆ దిశగానే ఆయన ఆలోచనలు, చర్యలు, పర్యటనలు, ప్రసంగాలు ఉంటున్నాయి.

రెండుసార్లు ప్రధానమంత్రి కావడంలో పెద్ద "కిక్" ఏమీ లేదు. రాజకీయాలలో తాడు, బొంగరం కూడా లేదని రాజకీయవర్గాల వారిలో అధికులు భావించే మన్మోహన్‌సింగ్ కూడా రెండుసార్లు ప్రధానమంత్రి అయ్యారు. అందువల్ల, మూడోసారి ప్రధాని కావడమే నరేంద్ర మోడీ ఏకైక లక్ష్యం.

దానికోసం ఏ రాష్ట్రంలో అయినా... ఎన్నిసార్లయినా పర్యటించడానికి ఆయన సిద్ధం. ఏ వేదిక మీద ఎవరిని ఆలింగనం చేసుకోడానికయినా ఆయన రెడీ.

ఆంధ్రలో మాత్రం టీడీపీని ఆలింగనం చేసుకోడానికి ఆయన సిద్ధంగా లేరు. కనీసం ఒక వేదికను పంచుకోడానికి కూడా ప్రధాని మోడీ సుముఖంగా లేరు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఆయనకో స్కెచ్ ఉంది. ఓ "విజన్" ఉంది. దానిని ఆయన నేరుగా అమలు చేయలేరు కదా! తన అంతరంగానికి అనుగుణంగా ఏపీని తయారుచేసేవారు ఆయనకు కావాలి.

దానిని జగన్మోహన్‌రెడ్డి సారధ్య ప్రభుత్వం అమలు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ సారధులు సంతృప్తికరంగా, సంపూర్ణంగా సహకరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి మోడీ "ఎజెండా", "విజన్" ఇంకా అసంపూర్ణంగా ఉండి ఉంటే.. మరో అయిదేళ్లపాటు జగన్ సారధ్య ప్రభుత్వం ద్వారా మోడీ తన ఎజెండాను అమలు చేయించాలని అభిలషిస్తూ ఉండి ఉండవచ్చు కూడా.

అయితే, బీజేపీకి 'మిత్ర'పక్షంగా వ్యవహరిస్తున్న పవన్ కళ్యాణ్ (అంటే జనసేన) మాత్రం టీడీపీ వైపు వెళ్లకుండా మోడీ ఆపలేకపోయారు. పవన్ కళ్యాణ్ టీడీపీ వైపు వెళ్లకుండా ఉంటే, ఇంకా బాగుండి ఉండేది. టీడీపీ పొడ గిట్టని నరేంద్ర మోడీ, పవన్ కళ్యాణ్ టీడీపీ వైపుకు వెళ్లకుండా ఎందుకు నిలువరించలేక పోయారనే విషయం అర్థం కాదు. ఒకవేళ, పవన్ కళ్యాణ్ ద్వారా జగన్ పార్టీకి చెక్ పెట్టాలని భావించి, ఆ కంటితో జగన్‌ను, ఈ కంటితో పవన్‌ను ప్రోత్సహిస్తున్నారేమో తెలియదు.

"ఆంధ్రలో మోసీపీ అభిమతాన్ని కాదని బయట తిరిగినా... మాకేమీ ఇబ్బంది లేదు..." అంటూ తెలంగాణలో బీజేపీ... పవన్ కళ్యాణ్‌తో పొత్తు పెట్టుకుంది.

తెలంగాణలో ఉందో... లేదో తెలియని పవన్ రాజకీయ బలాన్ని నమ్ముకుని 8 సీట్లు వదిలిపెట్టిన బీజేపీ మరి, అదే తెలంగాణలో గణనీయమైన బలం కలిగివున్న టీడీపీని మాత్రం దగ్గరకు కూడా రానివ్వలేదు. తెలంగాణలో స్నేహ హస్తం అందిస్తే రేపు ఆంధ్రలో కూడా టీడీపీతో జత కట్టాల్సి వస్తుందేమోనన్న అనుమానం.

టీడీపీతో బహిరంగంగా జత కట్టాక, జగన్ ప్రభుత్వానికి ఢిల్లీ నుంచి కన్ను గీటడం కుదరదు. జగన్ సారధ్య ప్రభుత్వ చర్యలపై వ్యక్తమయ్యే విమర్శల పట్ల ఢిల్లీ బీజేపీ పెద్దలు మౌనం వహించడం రాజకీయ వర్గాలలో ఎబ్బెట్టుగా ఉంటుంది. మోడీ, అమిత్‌షాలు ఆంధ్రకు వచ్చి టీడీపీని అభినందించడం... జగన్‌ను విమర్శించడం కుదరదు. బీజేపీ అనేది ఆంధ్రలో ప్రధాన ప్రతిపక్షమూ కాదు, ప్రధాన రాజకీయ పార్టీ కూడా కాదు. టీడీపీ పొలిటికల్ ఫ్రెండ్‌కు... జస్ట్ ఓ పొలిటికల్ ఫ్రెండు.

అందుకే, ఆంధ్రలో వైసీపీని కాదని టీడీపీ వైపు బీజేపీ చూడడం లేదు. తెలంగాణలో రావడానికి అవకాశం ఉన్న రాజకీయ ప్రయోజనాన్ని కూడా అది వదిలేసుకుంది. తెలంగాణలో టీడీపీని మోసీపీ







వదిలేసుకోవడం వల్ల కలిగే లాభనష్టాలు... ఏమిటి అనే విషయం రేపు డిసెంబర్ 3వ తేదీన తెలుస్తుంది. ఆ తరువాత ఆంధ్రలో మోడీ–షా వ్యూహం మారితే మారవచ్చు.

మరి, ఆంధ్రలో టీడీపీ పొడ కూడా గిట్టని బీజేపీ చంద్రబాబు కుటుంబానికే చెందిన పురందేశ్వరికి రాష్ట్ర శాఖ అధ్యక్ష పదవి ఎందుకు అప్పగించిందో తెలియదు.

జగన్ ప్రభుత్వాన్ని ఆమె డైలీ బేసిస్‌లో తూర్పారబడుతున్నారు. జగన్ ప్రభుత్వం నిర్వాకాలపై సీబీఐ, ఈడీ విచారణలకు ఆమె పట్టుబడుతున్నారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. మెయిన్ స్ట్రీమ్ మీడియాలోను, సోషల్ మీడియాలోనూ ఆమె విమర్శలకు బ్రహ్మాండమైన ప్రచారం లభిస్తోంది. టీడీపీ నేతల విమర్శలకు మించి మరీ ఆమె వైసీపీని విమర్శిస్తున్నారు. విమర్శలే కాదు. క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు కూడా.

జగన్ రాజకీయానికి "ఇరుసు" లాంటి విజయసాయిరెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని కూడా ఆమె అదేపనిగా డిమాండ్ చేస్తున్నారు. ఆ పార్టీ కేంద్ర నాయకులు ఆమెతో గొంతు కలపడం లేదు కానీ, పురందేశ్వరి ప్రకటనలను, భావాలను, దూకుడును ఖండించడం కూడా లేదు.

అంటే... ఆమె మాటలను వారు చూస్తూ ఊరుకుంటున్నారు. దీంతో, కేంద్ర బీజేపీ నేతల మనసులలో ఏమి ఉందో అనే సందేహాలు కలగడం సహజం.

కేంద్ర బీజేపీ నాయకులకేమో టీడీపీ అంటే పడదు అనేది ఇప్పుడు బహిరంగ రహస్యంగా మారిపోయింది. అదే పార్టీ రాష్ట్ర నాయకత్వానికేమో వైసీపీ అంటే పడదు. అలాగే, ఎన్డీఏలో సభ్యుడిని అని చెప్పే పవన్ కళ్యాణ్ కేమో వైసీపీ అంటే పడదు. ఆయనను రాజకీయంగా కౌగిలించుకుంటూ తిరిగే బీజేపీకేమో టీడీపీ వాసన పడదు.

పోనీ పవన్ కళ్యాణ్, ఆంధ్ర బీజేపీ పార్టీ మాత్రమే కలిసి ఎన్నికలకు వెళితే.... ఏమవుతుందో పవన్ కళ్యాణ్ ఇదివరకే స్పష్టంగా చెప్పారు. ఆ విషయం తెలిసినప్పటికీ తమకు నష్టం ఏముంది కొత్తగా అనేది బీజేపీ పాయింట్.

కానీ, తాము స్నేహహస్తం అందిస్తే టీడీపీ – జనసేన కూటమి ఎక్కడ బలపడిపోతుందో అన్న అదురులో ఢిల్లీ పెద్దలు ఉన్నారేమో తెలియదు.

లేకపోతే, సొంతంగా పోటీచేస్తే.... ఒక్క స్థానంలోనూ డిపాజిట్ రాక, అటు వైసీపీతోనూ బహిరంగంగా కలవలేక, ఇటు టీడీపీకీ మద్దతు ప్రకటించలేక... ఆంధ్ర రాజకీయాల్లో నరేంద్రమోడీ సారధ్య బీజేపీ ఎటువంటి పాత్ర పోషిస్తున్నట్టు? ఒక రాజకీయ పార్టీ అన్న తరువాత అధికార పార్టీ వైపు అయినా నిలబడాలి.... లేదా ప్రతిపక్షం వైపు అయినా నిలబడాలి. ఈ రెండింటిలో బీజేపీ ఏదీ ఓపెన్‌గా చేయడం లేదు.

వైసీపీతో బహిరంగంగా పొత్తుపెట్టుకుని ఎన్నికలకు వెళితే, బీజేపీకి ఇంతకంటే వచ్చే నష్టం ఏమిటి? వస్తే... గిస్తే... లాభమే గానీ నష్టం అనే ప్రశ్నే లేదు. వైసీపీకి కేంద్రం నుంచి నైతిక మద్దతు లభించినట్టు ఉంటుంది. బీజేపీ నాయకులకు వైసీపీ నుంచి సమస్త వనరులూ సమకూరడానికి ఇబ్బంది ఉండదు కూడా. బోడి గుండుకు కొత్తగా ఊడిపోయేది ఏముంటుంది? వస్తే నాలుగెంట్రుకలు మొలవాలి గానీ.

మరి, వైసీపీ ప్రభుత్వంపై ఒంటి కాలితో లేస్తున్న అంధ్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరిని ఆ పదవి నుంచి ఇందుకోసం తప్పిస్తారా? ఈశాన్య రాష్ట్రాల్లో దేనికోదానికి గవర్నర్‌గా పంపేసి, వైసీపీకి తలనొప్పి లేకుండా చేస్తారా? లేకపోతే పాండిచేరి కూడా గవర్నర్ లేకుండానే నడుస్తుంది. ఆమె "అక్కడ" ఉన్నంత కాలం వైసీపీతో అధికారికంగా బీజేపీకి సయోధ్య కుదరదన్నదే పరిశీలకుల భావన.

మరి పవన్ కళ్యాణ్‌ను ఏం చేస్తారు? వదిలేస్తారా?

తెలంగాణలో ఆయనకు ఇచ్చిన 8 సీట్లలో ఆయన బలమెంతో చూశాకే ఆంధ్రలో ఆయనతో ఎలా డీల్ చెయ్యాలనే విషయం బీజేపీ కేంద్ర పెద్దలు ఒక అంచనాకు వస్తారేమో.

మొత్తం మీద ఆంధ్రలో రాజకీయానికి ఒక సిద్ధాంతం అంటూ ఏమీ లేదు. ఒక పద్ధతి అంటూ కూడా ఏమీ ఉన్నట్టు లేదు.

మ్యూజికల్ ఛైర్స్.

కేంద్ర బీజేపీకి టీడీపీ పొడ గిట్టదు. బీజేపీ పార్టీ రాష్ట్ర శాఖకు వైసీపీ పొడ గిట్టదు. వైసీపీకి పవన్ కళ్యాణ్ పొడ గిట్టదు. జనసేనను వీపుకి గట్టిగా కట్టుకుని టీడీపీ... మోడీని వీపుకు కట్టుకుని వైసీపీ... అధికారం అనే మ్యూజికల్ ఛైర్ చుట్టూ గుండ్రంగా తిరుగుతున్నాయి.

ఈ "పిలక తిరుగుడు" రాజకీయాలకు చెక్ పెట్టవలసింది ఓటర్లే.

– భోగాది వేంకట రాయుడు
medhomadhanam@gmail.com

# ఆంధ్రాలో టెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

బాయ్, బాయ్... కేసీఆర్ నినాదంతో ఎన్నికల రణరంగంలో పోరాడుతున్నారు. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి ఎవరు..? అన్న ప్రశ్నకి కూడా అవకాశం ఇవ్వకుండా అధికారం వస్తే అందరమూ సీఎంలమే అన్నట్లుగా పనిచేస్తున్నారు.

తెలంగాణలో బిఆర్ఎస్‌కి, బీజేపీకి కామన్ శత్రువు కాంగ్రెస్. ఎలాగైనా కాంగ్రెస్‌ని అక్కడ గెలవనీయకూడదని ఇప్పటికే భాజపా-బిఆర్ఎస్ అంతర్గతంగా లోపాయికారి ఒప్పందం చేసుకున్నట్లు రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. చివరికి అక్కడ ప్రజల తీర్పు ఎలా ఉంటుందో మరో 16 రోజులలో తేలిపోతుంది.

## ఆంధ్రాలో టెన్షన్!

తెలంగాణ ఎన్నికలు అక్కడ నేతలకన్నా ఆంధ్రా నాయకులనే ఎక్కువ టెన్షన్ పెడుతున్నాయంటున్నాయి రాజకీయవర్గాలు. ఆంధ్రాలో 2019లో వచ్చిన 151 సీట్లతో సంతృప్తి చెందని ముఖ్యమంత్రి జగన్ తనకు మొత్తం 175 కావాలంటున్నారు. ఆ దిశగా తరచూ తన సైన్యానికి బ్రెయిన్ వాష్ చేస్తూనే ఉన్నారు. గతంలో వచ్చిన 151 ఎలాగూ వచ్చేస్తాయన్నది జగన్ ధీమా అన్నది వారి ఆలోచన. అయితే, అంతటి మితి మీరిన విశ్వాసంతో ఉన్న తమ నాయకుడిపై ప్రజల్లో నిజంగా అంత ఆదరణ ఉందా? అన్న అనుమానం కూడా వైసీపీ శ్రేణుల్ని వేధిస్తోందని ఒక నాయకుడు చెప్తున్నాడు. తెలంగాణలో ఎన్నికలకి రెండు నెలలముందు వరకూ తెరాస నుండి ఒక్కరు బయటకి రాలేదు. నోటిఫికేషన్ వచ్చాక పుట్టలోనుండి చీమలు బయటకి వచ్చినట్లుగా బిఆర్ఎస్ పార్టీలోనే ఇన్నాళ్లూ గుంభనంగా ఉన్న కేసీఆర్ అనుచరగణాలు పార్టీ నుండి బయటకి వచ్చి, వ్యతిరేక స్వరాలు వినిపించడం మొదలుపెట్టాయి. రేపు ఆంధ్రాలో ఏం జరగ బోతోందో అన్న అలజడి అప్పుడే వైసీపీ బృందాలలో మొదలైపోయిందంటున్నారు విశ్లేషకులు. ఆంధ్ర విషయానికొస్తే ఇక్కడ వైసీపీకి, బీజేపీకి కామన్ శత్రువు టీడీపీ. అయితే, తెలంగాణలో బీజేపీతో కలిసి పోటీచేస్తున్న జనసేనపార్టీ ఆంధ్రాలో టీడీపీతో కలిసి పోటీచేస్తామని ఇప్పటికే ప్రకటించింది. ఇలాంటి సమయంలో పవన్ కళ్యాణ్ ప్రభావాన్ని పరీక్షించడానికే తెలంగాణలో ఆయనకి 8 సీట్లు ఇచ్చారని విశ్లేషకులు అంటున్నారు. ఒకవేళ అక్కడ జనసేనాని ప్రభావం అనుకూలంగా కనపడితే ఆంధ్రాలో కూడా బీజేపీ తన స్టాండు మార్చే అవకాశం లేకపోలేదన్నది వారి అభిప్రాయం. అదే పవన్ మళ్ళీ డిపాజిట్లు కోల్పోతే, ఆయన నిర్ణయంతో పనిలేకుండా బీజేపీ తన సొంత స్ట్రాటజీతో వెళ్తుంది. మొత్తానికి 2024లో ఆంధ్రాలో జరగబోయే ఎన్నికలకు ట్రయల్‌లా తెలంగాణ ఎన్నికలను పేర్కొంటున్నారు విశ్లేషకులు. అక్కడ జరుగుతున్న ఎలక్షన్ ఇక్కడ వారిని టెన్షన్ పెడుతోందని, అక్కడి ఫలితాల ఆధారంగా ఆంధ్ర పార్టీలు అటెన్షన్ అవుతాయని కూడా అభిప్రాయపడుతున్నారు!

## ఇందిరమ్మ విగ్రహాన్ని సుందరీకరించాలి

నెల్లూరులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహాన్ని సుందరీకరించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ నగర మేయర్ స్రవంతికి 15వతేదీ వినతిపత్రం సమర్పించారు. నవంబరు 19వ తేదీ ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి సూచనతో, ఇందిరమ్మ విగ్రహానికి పెయింటింగ్ వేయించి, ఆ ప్రాంతాన్ని పూల అలంకరణతో సుందరీకరించాలని మేయర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఫజులుద్దీన్, సాయిరామ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు.. గొలగమూడి విద్యార్థినులు

వెంకటాచలం మండలంలోని గొలగమూడిలోని ఆశ్రమ గిరిజన బాలికల పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నాగలక్ష్మీ వరప్రసన్న, ఇలాక్షిలు ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు గుంటూరు జడ్పీ పాఠశాలలో జరిగే అండర్-14 సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల పీడీ షబిక తెలిపారు.

## క్రీడాకారిణికి విపిఆర్ రూ. లక్ష ఆర్థిక సాయం




వింజమూరుకు చెందిన యువ క్రీడాకారిణి, జంప్ రోప్ విభాగంలో విశేష ప్రతిభ చూపుతున్న జిల్లెల వెంకట హర్షిణికి రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకాపా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) ఇటీవల లక్ష రూపాయల ఆర్థికసాయం అందించారు. వింజమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఆ బాలిక జంప్ రోప్ క్రీడా విభాగంలో ఇప్పటికే జిల్లా, రాష్ట్ర స్థాయిలో అనేక పతకాలు సాధించింది. జాతీయ స్థాయిలోనూ ఉత్తమంగా రాణిస్తోంది. డిసెంబరులో థాయిలాండ్ దేశంలో నిర్వహించే అంతర్జాతీయ పోటీలకు వెళ్లేందుకు బాలిక తండ్రి శ్రీనివాసులుకు ఆర్థికస్తోమత లేకపోవడంతో, ఆ బాలిక ప్రతిభను గుర్తించిన వింజమూరు వైకాపా నాయకులు గణపం బాలకృష్ణారెడ్డి ఆ విషయాన్ని విపిఆర్ దృష్టికి తెచ్చారు. అందుకు స్పందించిన విపిఆర్ అంతర్జాతీయ పోటీల్లో ఆ బాలిక పాల్గొనేందుకు తన సొంత నిధులు లక్ష రూపాయలు అందించి చేయూతనిచ్చారు. దాంతో ఆ బాలిక, ఆమె తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ విపిఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇరుకళలమ్మవారి హుండీ రాబడి రూ. 7.21లక్షలు



నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం జరిగింది. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 97 రోజులకి గాను ఆలయ హుండీ ఆదాయం 7,21,973 రూపాయలు వచ్చినట్లు ఆలయ ఛైర్మన్ రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్) తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ ఇఓ బొగ్గల మల్లికార్జున్‌రెడ్డి, దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ సుధీర్, ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు రాచూరు రమేష్ యాదవ్, కంచర్ల పెంచలమ్మ, పల్లాల రాములమ్మ, కట్టా చిన్నా, దైవజ్ఞ స్వామి, జయస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అస్తమించిన చంద్రమోహనుడు



***తన అద్భుతమైన నటనా చాతుర్యంతో అశేష ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న విలక్షణ నటుడు, నట చంద్రుడు..ఇక లేరు. అనారోగ్యంతో నవంబరు 11న హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన అస్తమించడంతో తెలుగు సినిమా రంగంతో పాటు, తెలుగు, తమిళ ప్రజలంతా శోకతప్తులయ్యారు. తొలినాళ్ళ పాతతరం నటులు, అందులోనూ నటనలో దిగ్గజాల వంటివారు.. ఎన్టీఆర్, ఏఎన్నార్, శోభన్ బాబు, కృష్ణంరాజు..ఇలా ఒక్కొక్కరుగా ఉద్దండ నటులంతా కాలక్రమంలో కనుమరుగు అవుతుండడం అందరికీ బాధగా ఉంది. అందులోనూ నవంబరునెల ఒక విషాదంగా మారుతోంది. సూపర్‌స్టార్ కృష్ణ కూడా గత ఏడాది నవంబరులోనే మనల్ని వీడి పోయారు. చంద్రమోహన్ మరణంతో తెలుగు సినీరంగం విషాదంలో మునిగి పోయింది. ఓ 'సిరిసిరిమువ్వ' రాలిపోయినట్లయింది.***

**తొ**లి తరం తెలుగు సినీ నటులు చంద్రమోహన్ అంటేనే సినీరంగంలో ఒక ప్రత్యేక స్థానం. ఎంతో కష్టపడి ఉన్నతస్థాయికి వచ్చిన నటులాయన. ఏ పాత్ర ఇచ్చినా, ఎంతటి కష్టమైనదైనా ఆయన అలవోకగా నటించగలరు. హావభావాల సంగతి ఇక చెప్పనక్కరలేదు. ఆయనో ఆల్‌రౌండ్ యాక్టర్. విభిన్నమైన పాత్రలు..విలక్షణమైన నటనతో పాటు పాత్రోచితంగా నటించడమంటే ఏమిటో చంద్రమోహన్ నుంచే తెలుసుకోవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన సహజనటులు. తొలి సినిమాకే ఆయనకు 'నంది' అవార్డు రావడం, ఆ తర్వాత దాదాపు 9 వందల చిత్రాలకు పైగానే ఆయన నటించడం, హీరో పాత్రల్లోనే కాక, ఏ పాత్రలోనైనా ఇట్టే ఒదిగిపోవడం ఆయన నటనా ప్రతిభకు నిదర్శనం. తెలుగుచిత్రాల్లోనే కాక, ఎన్నో తమిళ చిత్రాల్లో కూడా ఆయన నటించి తమిళనాట కూడా ప్రఖ్యాతిని సంపాదించుకున్నారు. రంగులరాట్నం, సిరిసిరిమువ్వ, సుఖదుఃఖాలు, కాలం మారింది, ఓ సీతకథ, సీతామాలక్ష్మి, పదహారేళ్ళ వయసు, ప్రతిఘటన, జీవనతరంగాలు, గంగ మంగ, ప్రాణం ఖరీదు, బొమ్మా బొరుసా, కలికాలం, శ్రీ షిర్డీసాయి మహత్యం, శుభోదయం, రాధాకల్యాణం, గోపాలరావుగారి అమ్మాయి, శంకరాభరణం వంటి ఎన్నో చిత్రాల్లో ఆయన నటన అమోఘం. అద్వితీయం. చంద్రమోహన్-జయసుధ జంటగా ఎన్నో సినిమాలొచ్చాయి. దాదాపు 34 చిత్రాల్లో వారిద్దరూ నటించి ప్రేక్షకులను అలరించడం విశేషం.

చంద్రమోహన్‌కు భార్య జలంధర, ఇద్దరు కుమార్తెలు..మధురమీనాక్షి, మాధవి ఉన్నారు. మీనాక్షి సైకాలజిస్ట్‌గా అమెరికాలో స్థిరపడ్డారు. మాధవి హైదరాబాద్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్నారు. ఏదేమైనా చంద్రమోహన్ లేకపోవడం సినీరంగానికే కాదు, తెలుగు ప్రేక్షకులోకానికే తీరని లోటు.

## ఎన్నో అవార్డులు :

చంద్రమోహన్ అసలు పేరు మల్లంపల్లి చంద్రశేఖర్ రావు. కృష్ణా జిల్లా పమిడిముక్కల గ్రామం ఆయన స్వస్థలం. 1942 మే 23న జన్మించిన చంద్రమోహన్ బాపట్లలోని వ్యవసాయ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసి, ఆ తర్వాత సినిమారంగంపై ఆసక్తితో చెన్నై వెళ్ళారు. ప్రముఖ దర్శకులు కె.విశ్వనాథ్ ఆయనకు బంధువు కూడా. 1996లో తొలి సినిమా 'రంగులరాట్నం'లో చంద్రమోహన్ నటన అమోఘం. ఆ చిత్రంలో ఆయన ఉత్తమనటనకు 'నంది' అవార్డు లభించింది. ఆ తర్వాత 'చందమామ రావే' చిత్రానికి ఉత్తమ హాస్యనటుడిగా, 'అతనొక్కడే' చిత్రంలో ఉత్తమ సహాయనటునిగా కూడా 'నంది' అవార్డులు అందుకున్న ఘనత చంద్రమోహన్‌కే దక్కింది. పదహారేళ్ళ వయసు, సిరిసిరిమువ్వ, సినిమాల్లో ఉత్తమనటునిగా ఆయన ఫిలింఫేర్ అవార్డులు అందుకున్నారు. హీరోగా ఆ చిత్రంలో పరిచయమైన తర్వాత దాదాపు 175 సినిమాల్లో ఆయనే హీరో. దాదాపు అయిదు దశాబ్దాల సినీప్రస్థానంలో ఆయనెన్నో అభినందనలు, అవార్డులు అందుకున్నారు.



## బాలు అంటే అభిమానం

గానగంధర్వుడు బాలు అన్నా, నెల్లూరన్నా చంద్రమోహన్‌కు ఎంతో అభిమానం. ఆయన చిత్రాలెన్నో నెల్లూరులో శతదినోత్సవాలు జరుపుకున్నాయి. ప్రత్యేకించి బాలు అంటే ఎంతో ఆత్మీయత. ఆయన చిత్రాల్లో ఎన్నో పాటలు పాడారాయన. బాలు పాడితే చంద్రమోహన్ పాడినట్లే ఉండేది. బాలు పేరుతో ఇచ్చే జాతీయ అవార్డులను 2019 జూన్ 4న నెల్లూరు టౌన్‌హాలులో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చేతులమీదుగా ఆయన 'బాలు జాతీయ పురస్కారం' అందుకున్నారు. ఈ వేడుకలో చంద్రమోహన్ దంపతులను బాలు, శాంత బయోటెక్నిక్స్ అధినేత కె.ఐ. వరప్రసాద్‌రెడ్డి, వెన్నెలకంటి, 'లాయర్' అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి తదితరులంతా ఘనంగా సన్మానించారు. అదే వేదికపై సిరిసిరి మువ్వ సినిమాలోని 'రా దిగిరా.. దివి నుంచి భువికి దిగిరా' అనే గీతాన్ని ఆ చిత్రంలో అద్భుతంగా పాడిన ఎస్పీబీ, ఆ పురస్కారం రోజున చంద్రమోహన్ సమక్షంలో కూడా మహాద్భుతంగా పాడి అందరి కరతాళ ధ్వనులందుకోవడం విశేషం!

ఈ విశిష్ట పురస్కారం అందించడం బాలూకి అదే చివర అయితే, అంతటి గొప్ప పురస్కారం అందుకోవడం కూడా చంద్రమోహన్‌కు అదే చివరిది కావడం యాదృచ్ఛికం.

శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి..

# వీపీఆర్ రూ.10 లక్షల విరాళం



నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు, ప్రముఖ వదాన్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (వీపీఆర్) బుచ్చిరెడ్డిపాలెంలో వెలసిన శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఈనెల 11న 10 లక్షల రూపాయల విరాళం అందజేశారు. ఇటీవల బుచ్చిరెడ్డిపాలెంలో తన పర్యటన సందర్భంగా ఆయన శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి, ఆలయానికి తన వంతుగా ఈ విరాళం ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీకి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రతినిధులు వేమిరెడ్డి కోటారెడ్డి, వీపీఆర్ ప్రత్యేక కార్యనిర్వహణాధికారి సిహెచ్ పెంచలరెడ్డి చేతులమీదుగా ఆలయ నిర్వాహకులకు ఆమేరకు చెక్కును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ కేతరాజు కేశవరావు, ఉపాధ్యక్షులు కె.కోటేశ్వరరావు, కార్యదర్శి దర్శి బాలనరసింహారావు, గౌరవాధ్యక్షులు టంగుటూరి మల్లికార్జునరెడ్డి, జాయింట్ సెక్రటరీ కాసా శ్రీనివాసులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అవగాహనతోనే మధుమేహ నియంత్రణ

## - డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య

మధుమేహం (డయాబెటిస్) వ్యాధి నివారణకు అవగాహన ముఖ్యమని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య చెప్పారు. నవంబరు 14న ప్రపంచ మధుమేహదినం సందర్భంగా నెల్లూరులోని నారాయణ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆధునిక జీవనశైలి, మానసిక వత్తిడి తదితరాల వల్ల ఈ వ్యాధి వస్తోందని, రోజుకు కనీసం అర్ధగంటపాటు నడక, వ్యాయామం చేయడం, సరైన పోషకాహారం తీసుకోవడం, వేళకు నిద్రపోవడం వంటి మంచి అలవాట్ల ద్వారా ఈ వ్యాధిని నియంత్రించుకోవచ్చని సూచించారు. ప్రపంచ మధుమేహ దినం సందర్భంగా నారాయణ ఆసుపత్రిలో మధుమేహ రోగులకు రూ.4వేల విలువచేసే వైద్య పరీక్షలను రాయితీపై కేవలం రూ.1200కే అందిస్తామని నారాయణ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.హరి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక డయాబెటిక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆసుపత్రి ఏజీఎం ఏ.సి శేఖర్‌రెడ్డి, నారాయణ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి, అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలి, డాక్టర్ అరుణ్ కాంత్, డాక్టర్ చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# డెల్టాకు సాగునీరు.. రైతుల్లో ఆనందం

సోమశిల జలాశయం నుంచి జిల్లా రైతాంగానికి సాగునీటి విడుదల చేయడానికి ఐఏబీ సమావేశంలో నిర్ణయించినందుకు అల్లూరు మండల రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే, జిల్లా రైతుసంఘం గౌరవాధ్యక్షులు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి సూచనలతో పలువురు రైతులతో కలిసి జిల్లా రైతాంగానికి సాగునీరు విడుదల చేయాలని కోరుతూ ఇటీవల జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశామని ఆయన అనుచరుడు బాలకృష్ణమరాజు తెలిపారు. ఆమేరకు సాగునీరు వదిలేందుకు ఐఏబీ సమావేశంలో నిర్ణయించడంతో ఈనెల 14న అల్లూరులోని విష్ణువర్ధన్‌రెడ్డి నివాసంలో ఎరటపల్లి శేఖర్‌రెడ్డి, మాధవరావు, నలగట్ల రామ కృష్ణారెడ్డి, ఏరాసు మురళి, బాలు తదితరులు పాల్గొని అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

# ఇద్దరు సీఎస్‌డీటీలకు స్థానచలనం

జిల్లా పౌరసరఫరాల శాఖలో డెప్యూటీ తహశీల్దార్లు (సీఎస్‌డీటీ)గా పనిచేస్తున్న ఇద్దరిని ఈనెల 14న బదిలీచేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు. కందుకూరు సిఎస్‌డీటీ బి.జనార్ధన్‌ను అదే మండలంలో తహశీల్దారుగా, కావలిలో సిఎస్‌డీటీగా ఉన్న కె.వెంకటరామిరెడ్డిని కావలి ఎంఎల్ఎస్ పాయింట్ డెప్యూటీ తహశీల్దారుగా నియమించారు.

# శ్రీసిటీలో ఆధ్యాత్మిక వేడుక

## శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట గాయత్రీనగర్‌కు చెందిన మహిళా భక్తబృందం విష్ణు సహస్రనామ పారాయణం చేసి, పారాయణం వలన కలిగే ప్రయోజనాలను భక్తులకు వివరించారు. అనంతరం వాకచర్ల సుష్మ వీణకచేరీ భక్తులను అలరించింది. హంసధ్వని రాగంలో 'శక్తి సహిత గణపతి' కీర్తనతో ప్రారంభించి, శ్రీరాగంలో 'అంబ పరమేశ్వరి' తదితర భక్తిగీతాలను ఆమె వీనులవిందుగా వీణపై పలికించి అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ప్రతినిధులు, పరిశ్రమల ఉద్యోగులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తులందరికీ తీర్థప్రసాదాలతో పాటు, అన్నప్రసాదాలు అందజేశారు.

# ఆ ప్రతిపాదనలో మార్పులు చేయాలి

## ఏపీయూడబ్ల్యూజే నాయకుల వినతి

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించి ఐ అండ్ పీఆర్ కమిషనర్ రూపొందించిన ముసాయిదా జీఓలో కొన్ని మార్పులు చేయాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ నేతలు ఈనెల 13న రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ముసాయిదా జీవోలో పేర్కొన్న పలు నిబంధనల వల్ల రాష్ట్రంలో వేలాదిమంది జర్నలిస్టులు నష్టపోతారని వివరించారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి జర్నలిస్టులకు మేలు చేకూర్చేవిధంగా ఆ నిబంధనలు తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ జర్నలిస్టులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముసాయిదా జీవోలో వచ్చిన నిబంధనల విషయంపై సంబంధిత మంత్రులతోను, ముఖ్యమంత్రితోను సంప్రదిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు రమేష్, ఏపీయూడబ్ల్యూజే ఉపాధ్యక్షులు దయాశంకర్, నాగరాజు, కోశాధికారి హనూక్, సహాయ కార్యదర్శి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు

# చారిత్రిక ఉత్సవంగా.. కార్తీక దీపోత్సవం



కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని నవంబర్ 26వ తేదీ ఆదివారం నాడు మహా కార్తీక దీపోత్సవాన్ని నెల్లూరు నగరంలో ఘనంగా నిర్వహిస్తామని, తెలుగు రాష్ట్రాల్లో కార్తీక దీపోత్సవం అంటే నెల్లూరు నగరంలోని గణేష్ ఘాట్లో జరిగే చరిత్రాత్మక ఉత్సవంగా గర్వంగా చెప్పుకునేలా ఏర్పాట్లుచేస్తామని సింహపురి కార్తీక దీపోత్సవ సమితి అధ్యక్షురాలు డాక్టర్ కె.వెన్నెల అన్నారు. ఈనెల 14న నెల్లూరులోని రామ్మూర్తినగర్‌లో జరిగిన కార్తీకదీపం కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాకతీయ మహారాజు ప్రతాపరుద్రుడు నిర్మించిన నెల్లూరు స్వర్ణాల చెరువు, ఇరుకుల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చెంత గణేష్ ఘాట్‌లో జరిగే ఈ మహా కార్తీక దీపోత్సవం సింహపురి మహిళల ఐక్యతకు నిదర్శనమని అన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక మహిళ పాల్గొనేవిధంగా ఆయా ప్రాంతాల్లో మహిళా భక్తబృందాలతో కలిసి పనిచేస్తున్నామన్నారు. ప్రధాన కార్యదర్శి మల్లిక మాట్లాడుతూ, ఆరోజున గోపూజతో మొదలయ్యే మహా కార్తీక దీపోత్సవం కార్యక్రమాలు తాత్కాలిక మహాశివలింగ ప్రతిష్ట, గణపతి హోమం, రుద్రహోమం తదుపరి శివ పార్వతులు, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి అర్చనలు, కళ్యాణోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని, సాయంత్రం 4గంటలకు శ్రీ స్వర్ణలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నుంచి మహిళలతో ఉత్సవం, కార్తీక ఆకాశదీపం, జ్వాలాతోరణం, గంగా హారతి, కార్తీక మహాదీపోత్సవం కార్యక్రమాలతో పాటు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా కార్తీక మాసం తొలిరోజును పురస్కరించుకొని ఉసిరికచెట్టు కింద 108 దీపాలతో దీపారాధన కార్యక్రమం తదుపరి అన్నప్రసాదాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవసమితి నిర్వాహకులు కె.రాజేశ్వరి, కోడూరు జయప్రద, కార్పొరేటర్ కామాక్షి, గౌరవ సలహాదారులు శ్రీకంఠం రమణయ్య, సీవీ సుబ్రహ్మణ్యం, ముక్కాల ప్రసాద్, కోడూరు జయరాం, రమేష్ ఆచారి, ఏ వి ఆర్ మోహన్‌రావు, పలువురు భక్త బృందం నాయకులు పాల్గొన్నారు.

# టూకీగా...



## బంగాళాఖాతంలో అల్పపీడనం

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. ఈనెల 14న తోటపల్లి గూడూరు మండలంలోని కోడూరు సముద్రతీరం వద్ద అలలు 50 అడుగుల ముందుకు వచ్చాయి. అల్పపీడనం వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగకుండా మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని అధికారులు పదేపదే హెచ్చరికలు చేశారు.

## ఆత్మకూరు ఆసుపత్రిలో వసతులపై ఆరా

ఆత్మకూరులోని జిల్లా వైద్యశాలను ఈనెల 14వ తేదీ రాత్రి రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ సంయుక్త సంచాలకురాలు సరళమ్మ ఆకస్మికంగా పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన సేవలందించాలని వైద్యసిబ్బందికి చెప్పారు. డీసీహెచ్ఎ రమేష్, సూపరింటెండెంట్ శేషారత్నం, ఆర్ఎంఓ ఉషాసుందరి తదితరులు పాల్గొన్నారు.

## ముసునూరులో నాటుసారా పట్టివేత

కావలి రూరల్ మండలంలోని ముసునూరులో నాటుసారా విక్రయిస్తున్న కె.కల్యాణ్ అనే వ్యక్తిని ఇటీవల సెబ్ అధికారులు గుర్తించి అరెస్ట్ చేశారు. ఆయనవద్ద ఉన్న 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు కావలి సెబ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

## గులించర్ల వద్ద తెల్లరాయి ట్రాక్టర్ స్వాధీనం

సైదాపురం మండలంలోని గులించర్ల వద్ద ఈనెల 13న రాపూరు మండలంలోని రావిగుంట ప్రాంతం నుంచి విలువైన తెల్లరాయిని అక్రమంగా తీసుకొచ్చిన ట్రాక్టర్‌ను గుర్తించి సీజ్ చేసినట్లు నెల్లూరు అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ మాల్యాద్రి చెప్పారు.

## కావలిలో అయ్యప్ప భక్తులకు అన్నదానం

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని కావలి కలుగోళమ్మపేటలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రముఖ వస్త్ర వ్యాపారులు అమరా బ్రదర్స్‌వారు ఈనెల 14న అయ్యప్ప స్వాములకు అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో అమరా వెంకట సుబ్బారావు, వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, ధర్మకర్త దుగ్గిశెట్టి జయచంద్ర, అమరా విజయలక్ష్మి, దుగ్గిశెట్టి నవీన్ పాల్గొన్నారు.

## మైపాడు బీచ్‌లో యువకుడి దుర్మరణం

సముద్రంలో సరదాగా ఈతకొట్టేందుకు స్నేహితులతో కలిసి ఇందుకూరుపేట మండలంలోని మైపాడు బీచ్‌కు వచ్చిన అన్నమయ్యజిల్లా రాజంపేటకు చెందిన సయ్యద్ జావేద్ (26) ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి దుర్మరణం పాలయ్యాడు. కొద్దిసేపటికి యువకుని మృతదేహం ఒడ్డుకు చేరింది. దీంతో బీచ్‌లో విషాదం అలముకుంది.

## కందుకూరులో అగ్నిప్రమాదం.. ఇల్లు దగ్ధం

కందుకూరులోని పామూరురోడ్డు కూడలిలో ఈనెల 14న ఓ రెండంతస్తుల మేడలోని కింది పోర్షన్‌లో ఉన్నట్లుండి మంటలు అంటుకున్నాయి. ఆ సమయానికి ఇంట్లో ఎవరూ లేరు. ఇల్లు తాళం వేసివుండడంతో ప్రమాదం తప్పినట్లయింది. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. షార్ట్‌సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగివుండవచ్చని భావిస్తున్నారు.

## కొండాపురం పొలాల్లో మోటార్ల వైర్ల చోరీలు

మండల కేంద్రమైన కొండాపురం పొలాల్లో ఈనెల 13వ తేదీ రాత్రి విద్యుత్ మోటార్లలో ఉన్న రాగితీగను ఎవరో అపహరించుకుపోయారు. దాదాపు 20 మోటార్లకు ఉన్న వైర్లు చోరీకి గురైనట్లు రైతులు గుర్తించారు. పోలీసులు నిఘాపెట్టి ఈ చోరీలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

## ఆలయాలకు పూజాసామగ్రి వితరణ

మనుబోలు మండలంలో ఎస్సీఎస్టీల వారు నివసించే ప్రాంతాల్లో ఉన్న పలు గ్రామదేవతల ఆలయాలకు సనాతన ఫౌండేషన్ వారు ఈనెల 14న పూజాసామగ్రిని వితరణగా అందజేశారు. నిత్యదీపారాధనకు కూడా నోచుకోక పలు ఆలయాలు మూతపడుతుండడంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టామని ఫౌండేషన్ కన్వీనర్ గూడూరు వెంకటేశ్వర్లు చెప్పారు.

# అద్దంలో చందమామలా..
# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు



**ఆంధ్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలిచ్చేందుకు ఇన్నాళ్ళకైనా సుముఖత వ్యక్తం చేసి, ఆమేరకు జీఓ ఇచ్చినందుకు రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల్లో సంతోషం వెల్లువెత్తింది. అయితే, ఆ సంబరమంతా ఆ జీఓ చూశాక ఆవిరైపోయింది. భూముల ధరలు విపరీతంగా పెరిగిపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో లక్షలు చేతిలో ఉంటే తప్ప ఆ స్థలాలు దక్కే పరిస్థితి కనిపించడం లేదు. జీఓలో ఉన్న నిబంధనల ప్రకారం చూస్తే, ఇళ్ళ స్థలాలు అంత సులభంగా చేతికందవనే విషయం అర్థమవుతుంది. అద్దంలో చందమామలా కనిపించే స్థలాలు... ఊరించడమే తప్ప, ఆచరణలో ఎందరికి అందుతాయో తెలియదు. ప్రభుత్వం నిజంగానే జర్నలిస్టులకు మేలు చేయాలనుకుంటే, గతంలో దివంగత మహానేత డా.వైఎస్ ఇచ్చిన విధంగా మానవతా హృదయంతో ఉదారంగా స్థలాలివ్వాలని, లేనిపోని నిబంధనలతో కాలయాపన చేయడం తగదని జర్నలిస్టు వర్గాలు కోరుకుంటున్నాయి.**

రాష్ట్రంలో మీడియా రంగంలో వేలాదిమంది జర్నలిస్టులు ఉన్నారు. అటు ప్రింట్ మీడియా, ఇటు ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేసే ఎంతోమంది జర్నలిస్టులు అనునిత్యం పనివత్తిడితో, సమాజశ్రేయస్సు కోసం.. అన్ని వర్గాల ప్రజలకు సమాచారం అందించడం కోసం రేయింబవళ్ళు పనిచేస్తుంటారు. పెద్ద జీతాలు వచ్చేవాళ్లు ఏ కొద్దిమందో ఉంటారు. తక్కువ వేతనాలతోనే పనిచేసే పాత్రికేయులు వేలల్లోనే ఉంటారు. వారి కుటుంబాలను ఆదుకునేందుకు గతంలో డాక్టర్ వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎంతో సహాయం చేశారని, ఆయన మేలు మరచిపోలేమని ఇప్పటికీ ఎందరో జర్నలిస్టులు చెప్పుకుంటూనే ఉంటారు. ఇప్పుడు తాజాగా ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం, వారికి కూడా ఒక పత్రిక ఉండడంతో జర్నలిస్టుల కష్టాలు తెలుసు కనుక, తమకు ఇంకా మేలు జరుగుతుందని జర్నలిస్టులు భావించారు. కానీ, ఆచరణకు వచ్చేసరికి జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు కూడా సక్రమంగా ఇవ్వలేదు. రాష్ట్రంలో దాదాపు 23వేల మంది జర్నలిస్టులుంటే, ఇప్పటికి కేవలం 9 వేల మందికే ఇచ్చారు. ఈ నేపథ్యంలో, ఇళ్ళ స్థలాలు వస్తాయా?.. లేక అందని చందమామే అవుతాయా అన్నది జర్నలిస్టులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడిచ్చిన జీఓను వెంటనే సవరించకుంటే 2 శాతం మందికి కూడా స్థలాలు దక్కవని జర్నలిస్టుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 45 రోజుల్లోనే ప్రక్రియ కొలిక్కివచ్చేనా?..

ఇళ్ళస్థలాల కోసం జర్నలిస్టులు 45 రోజుల వ్యవధిలో దరఖాస్తు చేసుకోవాలని తాజాగా ప్రభుత్వం ఇచ్చిన జీఓలో పేర్కొంది. భూముల విలువ భారీగా పెరిగిపోతున్న నేటిరోజుల్లో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కేటాయించడం ఒక పెద్ద తంతు. ఒకవేళ ప్రైవేట్‌గా కొని ఇవ్వాలన్నా ధర ఆకాశాన్నంటుతుంటుంది. జర్నలిస్టులకు ఇచ్చే ఆ 3సెంట్ల భూమిని ఎక్కడివ్వాలో అధికారులు నిర్ణయించుకోవడానికే ఉన్న పుణ్యకాలం కాస్తా సరిపోతుంది. ఈలోగా ఒకవేళ ఎన్నికల కోడ్ వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అన్నది మరో ప్రశ్న. గతంలో డాక్టర్ వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జర్నలిస్టుల విషయంలో ఎంతో శ్రద్ధ చూపేవారు. ఏ సమస్యలతో బాధపడుతున్నా, తెలిసిన వెంటనే సమస్యలు పరిష్కరించి ఆదుకునేవారు. జర్నలిస్టుల కుటుంబాలకు ఆయన చేసిన సాయం అంతా ఇంతా కాదు. ఇళ్ళ స్థలాల కేటాయింపులో ఆయన తీసుకున్న చొరవ అపూర్వమనే చెప్పాలి. ఎకరా భూమి అప్పట్లో సుమారు రూ.27లక్షల వరకు ఉంటే, జర్నలిస్టులు కూడా కొంత శాతం చెల్లించాలి కాబట్టి, ఆ దామాషా ప్రకారం చూసినా జర్నలిస్టులు వేలాదిరూపాయలు ఎక్కడనుంచి తెస్తారని ఆయన ఎకరాను 2 లక్షలకు కొనుగోలుచేసి నామమాత్రపు ధరకు జర్నలిస్టులకు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇప్పుడా పరిస్థితి లేదు. భూముల ధరలకు రెక్కలొచ్చి ఎగిరిపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ భూములు ఎక్కడున్నాయో వెదకాలి. వాటిని కేటాయించినా, 60శాతం ప్రభుత్వం, 40శాతం జర్నలిస్టులు చెల్లించాల్సి ఉంటుంది. 40శాతం చెల్లించాలంటే ఒక్కో స్థలానికి కనీసం 4 నుంచి 5 లక్షల దాకా అవుతుంది. అంత డబ్బు చెల్లించే స్తోమతు జర్నలిస్టుల్లో ఎంతమందికి ఉంటుందనేది పెద్ద ప్రశ్న. మళ్ళీ రిజిస్ట్రేషన్ల ఖర్చు తడిసి మోపెడవుతుంది. అందుకే, డా.వైఎస్‌లా నామమాత్రపు ధరకు ఇచ్చి సాయం చేయాలంటూ జర్నలిస్టులు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. జీఓలో మరో నిబంధన ఏమిటంటే, ఇళ్లస్థలాల కోసం దరఖాస్తు చేసుకునే జర్నలిస్టులకు తమ పేరుమీద కానీ, లేదా వారి జీవితభాగస్వామి పేరుమీద కానీ, వారు పనిచేస్తున్న ప్రాంతాల్లో, లేదా వారు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో ఇల్లు వగైరాలేమైనా ఉంటే, అలాంటివారికి ఇంటిస్థలం మంజూరు చేయబడదని స్పష్టం చేశారు. ఇదెంతవరకు సమంజసమో ప్రభుత్వమే ఆలోచించాలి. అన్నివిధాలుగా పరిశీలించి, ఇబ్బందికరంగా ఉండే నిబంధనలు సవరించి, వేగవంతంగా ఆ ప్రక్రియను పూర్తిచేయాలి. జర్నలిస్టుల కుటుంబాలకు మేలు జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. నేరుగా ముఖ్యమంత్రి చొరవ తీసుకుంటే తప్ప చందమామ అందదు.

## కళ్యాణ వైభోగం...!



మంచికి మారుపేరు, నిస్వార్థ సంఘసేవకులు, నిష్కళంక రాజకీయ నాయకులు నెల్లూరు మాజీ శాసనసభ్యులు జేకే రెడ్డి మనుమరాలు (పెద్ద కుమారుడు కీ॥శే॥ రామమోహన్ - శ్రీమతి వినుజల కుమార్తె) **రిథి - సిద్ధాంత్** (వంగ మధుసూదన్‌రెడ్డి - పద్మజల కుమారుడు)ల కళ్యాణం నవంబర్ 9 వ తేదీ హైదరాబాదులో జరిగింది. నవ దంపతులకి 'లాయర్' శుభ దీవెనలు.




Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com